

సర్కేడియన్ వి యాప్ ద్వారా గుండె వ్యాధుల నిర్ధారణ

- పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర
- 250 మందిని పరీక్షించిన సిద్ధార్థ్
- 10 మందికి గుండె సంబంధిత వ్యాధులున్నట్టు గుర్తింపు

-8లో

ఆదివాసీలకు అన్యాయం!?

పాతమల్లంపేటలో అనాదిగా సాగు చేసుకుంటున్న భూములు అన్యాక్రాంతం



గదబపాలెం గిరిజనులు సాగుచేసుకుంటున్న భూమి

- ఓ ఎన్ఆర్ఐ పేరుతో ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులు
- ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు ఆఫీస్ ఎదుట ఆందోళన
- సర్వే నంబర్‌ను సబ్‌డివిజన్ చేసి కట్టబెట్టారని ఆరోపణ
- 2022 సర్వే రిపోర్టు ఆధారంగానే ఆన్‌లైన్ చేసినట్టు తహసీల్దారు వెల్లడి

గొలుగొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): **ఐదు దశాబ్దాల నుంచి ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు ఓ ఎన్ఆర్ఐ హక్కుదారుడంటూ రెవెన్యూ అధికారులు అతని పేరుతో ఆన్‌లైన్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న గిరిజనులు ఆందోళనలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, బడాబాబులతో కుమ్మక్కై తమ సాగులో వున్న ప్రభుత్వ భూములను జిరాయితీగా మార్చేశారని వారు ఆరోపిస్తున్నారు. అయితే 2022లో నిర్వహించిన సర్వే రిపోర్టుల ఆధారంగా సంబంధిత వ్యక్తి పేరు మీద ఆన్‌లైన్ చేసినట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి అటు గిరిజనులు, ఇటు రెవెన్యూ అధికారులు చెబుతున్న వివరాలిలా వున్నాయి.**



ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలిస్తున్న మానవ హక్కుల వేదిక ప్రతినిధి కృష్ణ (ఫైల్)

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం గదబపాలెం గ్రామానికి చెందిన 34 కుటుంబాల గిరిజనులు, తమ నివాసాలకు సమీపంలో వున్న గొలుగొండ మండలం పాత మల్లంపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 850లో వున్న 36 ఎకరాలను సుమారు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. సుమారు 20 ఎకరాల్లో జీడిమామిడి తోటలు వుండగా, మిగిలిన భూమిలో వ్యవసాయ పంటలు పండించుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే సమయంలో ఈ భూములపై తమకు సాగు హక్కులు కల్పించాలంటూ మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సుమారు 20 రోజులపాటు ధర్నా చేశారు.

ఇదిలావుండగా ప్రస్తుత తహసీల్దార్ శ్రీనివాసరావు సర్వే నంబరు 850ని సబ్‌డివిజన్ చేసి, సర్వే నంబరు 850/1 కింద 23.4 ఎకరాలను ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన ఎన్ఆర్ఐ దుగ్గిరాల బాలకృష్ణ పేరుమీద ఆన్‌లైన్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న గిరిజనులు, ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పీఎస్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ... మిగతా 8వ పేజీలో



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గదబపాలెం గిరిజనులు (ఫైల్ ఫొటో)

దిబ్బలను సరిచేసి సాగు చేసుకుంటున్నాం



పాతమల్లంపేట రెవెన్యూ పరిధిలో మట్టి దిబ్బలు, ఎత్తుపల్లాలతో వున్న భూమిని మా పెద్దలు బాగు చేసి, సాగు చేయడం మొదలుపెట్టారు. వారి వారసులుగా ఇప్పుడు మేము సాగు చేసుకుంటున్నాం. జీడిమామిడి తోటలను సాగు చేసుకుంటూ బతుకుతున్నాం. రెవెన్యూ అధికారులు ఈ భూములను ఎన్ఆర్ఐకి కట్టబెట్టడం తగదు.

బొండా దేముడమ్మ, గదబపాలెం

ఉపాధిలో అక్రమాలు

మొక్కల పేరుతో పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగం

- రహదారుల పక్కన పచ్చదనం పెంచాలని ప్రభుత్వ నిర్ణయం
- 20230-24లో జిల్లాలోని 12 మండలాల్లో 7,095 మొక్కలు నాటించిన అధికారులు
- రెండేళ్లపాటు సంరక్షణకు ఒక్కో మొక్కకు రూ.305 చొప్పున చెల్లింపు
- ప్రతి 200 మొక్కల పర్యవేక్షణకు ఒక ఉపాధి కూలీ నియామకం
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- క్షేత్రస్థాయిలో పదో వంతు కూడా కానరాని మొక్కలు
- సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తున్న అక్రమాలు



బుచ్చెయ్యపేట మండలంలో వెదుళ్లగెడ్డ వంతెన నుంచి రాజాం వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఆలనాపాలనా లేని మొక్కలు

(అనకాపల్లి - ఆంధ్రజ్యోతి) **జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలు జరుగుతు న్నాయి. మట్టి పనులకు రాకుండానే హాజరైనట్టు మస్తర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారు. రహదారుల పక్కన పచ్చదనం కోసం మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తున్నట్టు రికార్డుల్లో చూపుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మొక్కలకు నీరు పోసేవారు లేక ఎండిపోయాయి.**

ఉపాధి హామీ పథకం కింద రహదారులకు ఇరువైపులా పచ్చదనం పెంచడానికి మొక్కలు నాటించి, వాటికి నీరు పోసి సంరక్షించేలా చర్యలు చేపట్టాలని డ్వామా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 2023-24లో అనకాపల్లి మండలంలో 850 మొక్కలు, గొలుగొండలో 975, కె.కోటపాడులో 480, కశింకోటలో 625, కోటవురట్లలో 625, మాడుగులలో 2,600, మాకవరపాలెంలో 300, నర్సీపట్నంలో 75, నాతవరంలో 175, రాంబిల్లిలో 300, సబ్బవరంలో 200, ఎలమంచిలిలో 115 మొక్కల చొప్పున మొత్తం 7,095 మొక్కలను సుమారు 18 కిలోమీటర్ల పొడవున నాటించారు. వీటికి రోజూ నీరు పోయడంతోపాటు పశువులు తినకుండా రక్షణ ఏర్పాట్లు చేయాలి. గోతులు తీయడం, మొక్కలు నాటడం, వాటిని నీరు పోయడం, సంరక్షించడం వంటి పనులకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. నిబంధనల ప్రకారం మొక్క నాటినప్పటి నుంచి రెండేళ్ల వరకు మొదటి సంవత్సరంలో 40 సార్లు, రెండో సంవత్సరంలో 25 సార్లు చొప్పున మొత్తం 65 సార్లు నీటిని అందించాలి. ఒకసారి మొక్కకు నీరు పెట్టినందుకు సంరక్షకునికి రూ.4.7 వంతున రెండేళ్లలో రూ.305 వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రతి 200 మొక్కల సంరక్షణకు స్థానిక ఉపాధి కూలీని ఒకరిని నియమించి, మొక్కల సంరక్షణ, ఎరువులు వేయడం, రెండు పర్యాయాలు కంచె వేసినందుకు కొంత మొత్తం కేటాయిస్తారు. ఇది సుమారు రెండు వేల రూపాయల వరకు వుంటుంది. జిల్లాలోని 12 మండలాల్లో 2023-24లో ఏడువేలకుపైగా మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, ఇతర పనులకు నిధులు ఖర్చు చేసినట్టు రికార్డుల్లో చూపారు. కానీ వీటిలో ప్రస్తుం పదో వంతు మొక్కలు కూడా కనిపించడంలేదు.

అనకాపల్లి, కశింకోట మండలాల్లో 2023-24లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై ఇటీవల జరిగిన సామాజిక తనిఖీల్లో సిబ్బంది చేతివాటం బయటపడింది. తుమ్మపాల, భట్లపూడి, మామిడిపాలెం, మాకవరం, మెట్టపాలెం, ఆర్‌వీపాలెంలలో అప్పుడు నాటిన మొక్కలు ఇప్పుడు కనిపించడం లేదని తేల్చారు. కశింకోట మండలం జమాదులపాలెంలో, బుచ్చెయ్యపేట మండలంలో వెదుళ్లగెడ్డ నుంచి రాజాం వెళ్లే రహదారి పక్కన నాటిన మొక్కల్లో సగానికిపైగా ఎండిపోయినట్టు తెలిసింది. జిల్లాలోని ఇతర మండలాల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఉపాధి హామీ పథకం నిధులతో ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటిస్తుండగా, వాటి సంరక్షణ, ఎదుగుదల ఎలా వుందో పైస్థాయి అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. కనీసం పర్యవేక్షించడం కూడా చేయడంలేదు. దిగువస్థాయి సిబ్బంది ఇచ్చే నివేదికలపై సంతకాలు పెడుతూ బిల్లులు మంజూరు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా సామాజిక తనిఖీలు జరిగినప్పుడు ఆ శాఖ ఉన్నతాధికారులే పర్యవేక్షకులుగా వ్యవహరిస్తుండడంతో ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం పనుల్లో జరుగుతున్న అక్రమాలపై అందిన ఫిర్యాదులపై విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం వుంది.

గోవాడ షుగర్స్‌పై సర్కార్ నిర్లక్ష్యం

ఫ్యాక్టరీని పట్టించుకోకపోవడం ప్రజాప్రతినిధులకు తగదు

- చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రావు సూర్యనారాయణ
- ఫ్యాక్టరీ వద్ద రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా
- రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్
- 24న చెరకు రైతులకు చెల్లింపులు: ఎండీ వెల్లడి



ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతు సంఘాల నేతలు

చోడవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నదని చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రావు సూర్యనారాయణ ఆరోపించారు. చెరకు రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని, ఫ్యాక్టరీని ప్రభుత్వమే ఆధునీకరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతు సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షుగర్ ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే, ప్రభుత్వంగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రైతు సంఘం నాయకులు డి.వెంకన్న, రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ, ఎన్నికల ముందు గోవాడ షుగర్స్‌ను గాడిలో పెడతామని ప్రకటించిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీవైపు ... మిగతా 8వ పేజీలో



ధర్నా శిబిరం వద్ద మాట్లాడుతున్న చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రావు సూర్యనారాయణ

పల్లె పండుగ పనులు ఉగాదినాడు ప్రారంభం

- కలెక్టర్ విజయకృష్ణన్
- అన్ని జిల్లాల కలెక్టర్లతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీడియో కన్ఫరెన్స్



అనకాపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులను ఉగాది పండుగ రోజు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. పంచాయతీరాజ్, పల్లె పండుగ పనులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనకాపల్లి కలెక్టరేట్ నుంచి విజయకృష్ణన్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఉగాది నుంచి వారం రోజులపాటు ప్రారంభోత్సవాలను పండుగ నిర్వహించాలన్నారు. జిల్లాలో మూడు నమూనా వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసేందుకు గ్రామాలను ఎంపిక చేయాలని వ్యవసాయ, జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాకు మంజూరైన పంట కుంటల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చెప్పారు.

నీటి గండం

పడిపోతున్న భూగర్భ జల మట్టాలు

- సంరక్షణ తగ్గింది...వినియోగం పెరిగింది
- వర్షపు నీరు ఇంకే పరిస్థితే లేదు
- తీర ప్రాంతంలో ఉప్పునీరు
- ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి చేయాలని నిపుణుల సూచన
- నేడు ప్రపంచ నేడు జల దినోత్సవం



మాకవరపాలెం మండలం మల్లవరంలో బోరు నుంచి సన్నటి ధార వస్తుండడంతో నీటి కోసం బకెట్లు, బిందెలతో వేచిఉన్న మహిళలు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): **మనిషి మనుగడకు నీరే ఆధారం. నీరుండే చోటనే నాగరికత పుట్టింది. అంతటి ప్రాముఖ్యత కలిగిన నీటి సంరక్షణలో మనం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాం. ప్రస్తుతం ఉపరితలంలో నీరే కాదు. భూగర్భంలో నీటిని కూడా విచ్చలవిడిగా వినియోగించుకుంటున్నాం. కానీ సంరక్షణ మాత్రం వదిలేశాం. అందుకే మార్చి మూడో వారంలోనే జిల్లాలోని పలు మండలాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మార్చి 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవం. ఈ ఏడాది నినాదం 'హిమనీనదాలు పరిరక్షణ'. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భూగర్భ జలాలపై కథనం ఇది...**

వర్షం తీరులో మార్పులు

నైరుతి రుతుపవనాల సీజన్ 120 రోజుల్లో గతంలో 75 నుంచి 80 రోజులు వర్షాలు కురిసేవి. వర్షం నీరు భూమిలో ఇంకిపోయేది. దీంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. చెరువులు, గెడ్డలు, బావుల్లో నీటి నిల్వలు నిండుగా కనిపించేవి. గత కొన్నాళ్లుగా పూర్తిగా వర్షాల తీరు మారిపోయింది. వర్షం కురిసే రోజుల సంఖ్య 70 కంటే తక్కువకు పడిపోయింది. ఒకేసారి భారీవర్షాలు కురవడంతో నీరు ఇంకే పరిస్థితి లేకుండాపోయింది. భూమిలో తేమ తగ్గిపోయింది.

అనకాపల్లిలో జిల్లాలో సగటు 4.16 మీటర్ల లోతున భూగర్భజల మట్టం

అనకాపల్లి జిల్లాలో పీజో మీటర్లు గల 20 మండలాల్లో సగటున 4.16 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. అత్యధికంగా అచ్యుతాపురంలో 14.66 మీటర్లకు భూగర్భజలాలు ... మిగతా 8వ పేజీలో

ఎండ తీవ్రతతో జనం విలవిల

- నాతవరంలో 40.2 డిగ్రీలు నమోదు



జనసంచారం అరకొరగా వున్న అనకాపల్లి మెయిన్ రోడ్డు

అనకాపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీక్షణంగా కాస్తున్నది. దీనికితోడు ఉక్కపోతతో జనం ఇబ్బంది పడుతున్నారు. అనకాపల్లిలో రద్దీగా వుండే ప్రధాన రహదారులు మధ్యాహ్న సమయంలో జనం సంచారం బాగా తగ్గిపోతున్నది. వాతావరణ శాఖ అందించిన వివరాల ప్రకారం శుక్రవారం జిల్లాలోని నాతవరం ... మిగతా 8వ పేజీలో

మందుల దుకాణాల్లో తనిఖీలు

స్టాక్‌లో తేడాలు వున్నట్టు గుర్తింపు

- మూడుచోట్ల రిజిస్టర్ ఫార్మాసిస్టులు లేకుండా మెడికల్ షాపులు నిర్వహణ



పెరుగుబజార్ రోడ్డులోని ఒక మెడికల్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు మందుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్ ఈగల్ బృందం, ఎన్డీపీఎస్ అధికారులు తనిఖీలు చేశారు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని పెరుగుబజార్ రోడ్డులోని నాలుగు మెడికల్ షాపుల్లో అధికారులు తనిఖీలు చేపట్టి మందులను, రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో వున్న స్టాక్‌కు, దుకాణాల్లో వున్న స్టాక్‌కు వ్యత్యాసం వున్నట్టు గుర్తించారు. మూడు దుకాణాల్లో రిజిస్టర్ ఫార్మాసిస్టులు లేరు. దుకాణాల లైసెన్సులను డిస్‌ప్లే చేయలేదు. తనిఖీలకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ టి.అప్పలనాయుడు తెలిపారు. ఈ తనిఖీల్లో డ్రగ్స్ కంట్రోల్ విభాగం ఏడీ విజయ్‌కుమార్, ఎన్డీపీఎస్ యాక్ట్ సీఐ గఫూర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈ రామ్మోహన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.13 (శనివారం సాయంత్రం)

సహర్ : 4.44 (ఆదివారం ఉదయం)

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు 31న లోకేశ్ శంకుస్థాపన

- రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ

-8లో

అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి ఏర్పాట్లు

- త్వరలో పనులు ప్రారంభం
- చేరుకుంటున్న భారీ యంత్రాలు



పనులు చేపట్టేందుకు చేరుకున్న భారీ యంత్రం



అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ నిర్మించనున్న ప్రధాన జంక్షన్

అచ్యుతాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికంగా శరవేగంతో అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఫ్లైఓవర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి భారీ యంత్రాలు ఇక్కడికి చేరుకుంటున్నాయి. అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డును కలుపుతూ ఈ వంతెన నిర్మాణం జరగనుంది. పూడిమడక రోడ్డులో గల ఐసీఐసీ బ్యాంక్ నుంచి అనకాపల్లి రోడ్డులో గల ఉన్నత పాఠశాల వరకు 530 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పున నిర్మిస్తారు. పూడిమడక వైపు 460 మీటర్లు, అనకాపల్లి వైపు 260 మీటర్ల స్లోపు రోడ్డు నిర్మిస్తారు. ఈ వంతెన నిర్మాణానికి 2022లోనే మట్టి పరీక్ష (సాయిల్ టెస్టింగ్) నిర్వహించారు. పంథొమ్మిది పిల్లర్లతో పాటు వంతెనకు ఇరువైపులా రెండు అప్రోచ్‌మెంట్లు వస్తాయి. ఈ మధ్యలో 19 పిల్లర్లు నిర్మిస్తారు. ప్రతి పిల్లర్ వద్ద పదిహేను అడుగుల లోతున గోతులు తవ్వి అప్పట్లో మట్టి పరీక్షలు చేశారు. కాగా, అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం చేపడితే వ్యాపారాలు దెబ్బతింటాయని కొందరు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. సెజ్‌లోని కర్మాగారాలకు యంత్ర సామగ్రిని తీసుకువెళ్లే భారీ వాహనాలు, కర్మాగారాలకు కార్మికులు, ఉద్యోగులను తరలించే బస్సులు, ఇతర వాహనాలు నేరుగా వంతెన పైనుంచి వెళ్లిపోతాయని, దీని వల్ల వ్యాపారాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని మరికొందరు అంటున్నారు. ఏదిఏమైనా అందరికీ ఉపయోగపడేలా వంతెన నిర్మించాలని అంతా కోరుతున్నారు.

6 నుంచి నియోజకవర్గంలో రథయాత్ర

- విజయవంతానికి ఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వచ్చే నెల ఆరో తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ రథయాత్రను అంతా విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎలమంచిలిలో శుక్రవారం మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఆధ్వర్యంలో నాలుగు మండలాలకు చెందిన ధార్మిక కమిటీల ప్రముఖులతో పాటు స్థానికులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ తన సొంత ఖర్చుతో అయోధ్య రాముని రథాన్ని రూపొందిస్తున్నారన్నారు. ప్రజల్లో మరింత ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్టు చెప్పారు. అయోధ్య రాముని రథం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తిరుగుతుందన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ నెల 26, 27 తేదీల్లో నాలుగు మండలాలు, మునిసిపాలిటీ వారీగా సమావేశాలు నిర్వహించి నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. రథయాత్ర ఇన్‌చార్జ్ శివాజీ రాజు, వర్మ, ఎస్‌ఎస్‌ఎఫ్ జిల్లాకన్వీనర్లు నరేంద్ర చౌదరి, లలిత, రామలక్ష్మి, దేవుడు, ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్, మండల కన్వీనర్లు, ధర్మప్రచారకులు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తం కావాలని పోలీసులు గ్రామాల్లో ప్రచారం



ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఆరంభం అవుతున్న నేపథ్యంలో ప్రజలంతా చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతూ ఎలమంచిలి రూరల్ పోలీసులు గ్రామాల్లో ఆటోలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. వేసవిలో రాత్రి వేళ ఇళ్ల బయట పడుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే సెలవులకు ప్రయాణాలు అయ్యేవారు సమీపంలోని స్టేషన్‌లో సమాచారం అందించాలని వివరిస్తున్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రచారం చేస్తున్నారు. ప్రచార వాహనంపై చోరీలు ఎలా జరుగుతాయో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీని సైతం ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చక్కని బోధన

- శిక్షణ శిబిరంలో సిబ్బందికి సూపర్‌వైజర్లు సూచన



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

రాంబిల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు చక్కని విద్యనందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్‌వీఎస్ రాణి, మాలతీదేవి అన్నారు. మండలంలోని కొత్తూరు జడ్పీ హెచ్ స్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో శుక్రవారం మాట్లాడారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన సాగాలన్నారు. పౌష్టికాహారం లోపం గల పిల్లలను ఏవిధంగా గుర్తించాలి, వారికి ఏ విధమైన పౌష్టికాహారం అందించాలి తదితర అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పలు సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో చైల్డ్ లేబర్ డ్రైవ్

- వస్త్ర, వ్యాపార దుకాణాల్లో సహాయ కార్మిక అధికారి బృందం తనిఖీలు
- బాలలతో వెట్టి చాకిరీ చేయిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



వస్త్ర దుకాణంలో తనిఖీలు జరుపుతున్న బృందం సభ్యులు

ఎలమంచిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శుక్రవారం చైల్డ్ లేబర్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సహాయ కార్మిక అధికారి ఎస్.వెంకటేశ్వరావు స్థానిక పోలీసులు, జిల్లా బాలల సంరక్షణ ప్రతినిధి కేవీ చిన్నారావు, లోవరాజులతో కలిసి పలు వ్యాపార సంస్థల్లో తనిఖీలు జరిపారు. వస్త్ర వ్యాపారాలతో పాటు, కిరాణా తదితర దుకాణాల్లో బాల కార్మికులు పనిచేస్తున్నారేమోనని ఆరా తీశారు. బాలలతో వెట్టి చాకిరీ చేయించడం నేరమని సహాయ కార్మిక అధికారి వెంకటేశ్వరావు తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేసవి ఆరంభంలోనే మండుతున్న ఎండలు

- బెంబేలెత్తుతున్న జనం
- ముున్ముందు వాతావరణంపై మరింత ఆందోళన



ఎలమంచిలిలో పుచ్చకాయల బండి వద్ద రద్దీ

ఎలమంచిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఆరంభంలోనే ఎండలు మండుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుండడంతో వివిధ పనులపై బయటకు వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండల పుణ్యమా అంటూ శీతల పానీయాల వ్యాపారాలు జోరందుకున్నాయి. ఎలమంచిలి, పరిసర ప్రాంతాల్లో పలువురు చిరు వ్యాపారులు పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. కాయలను ముక్కలుగా కోసి ఉంచుతుండడంతో అటుగా రాకపోకలు సాగించేవారిలో చాలా మంది వీటిని కొని తింటూ ఉపశమనాన్ని పొందుతున్నారు. ఏది ఏమైనా పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే.. ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

'గ్రామాల్లో అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి'



వెదురువాడలో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అర్హులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. సీపీఎం చేపడుతున్న ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా మండలంలోని వెదురువాడ, గొర్లె ధర్మవరం, మడుతూరు పంచాయతీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ గ్రామాల్లో ఉపాధి పనులు లేక పేదలు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి వీరందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.సోమునాయుడు, గాలి అప్పారావు, శ్రీను, భవాని, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పాములవాకలో మెగా కంటి వైద్య శిబిరం



పాములవాకలో కంటి చూపు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కోటవురట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాములవాక గ్రామంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కిల్లాడశ్రీనివాసరావు సౌజన్యంతో రామాలయంలో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటిచూపు లోపాలు ఉన్నవారు కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే కళ్లద్దాలు ఇస్తారని, అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. 58 మందికి కంటిచూపు పరీక్షలు నిర్వహించగా, వారిలో 22 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరిని విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. చూపులోపం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు.

పాడి రైతులకు రాయితీపై విత్తనాల సరఫరా

కోటవురట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ఆర్థికంగా చేయూతచ్చేందుకు ప్రభుత్వం రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నదని పశు సంవర్ధక శాఖ ఏడీ పెట్ల నరేశ్ చెప్పారు. శుక్రవారం పాడి రైతులకు ఈ విత్తనాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎస్‌జీ జొన్న, ఆఫ్రికన్ టాల్ మొక్కజొన్న విత్తనాలు, మూడుటన్నులు గడ్డివిత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కారిడార్ భూముల్లో చురుగ్గా పనులు

నక్కపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. నక్కపల్లి మండలంలోని కారిడార్ భూముల్లో బల్క్‌డ్రగ్ పార్కు, సహా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కానున్నాయి. పరిశ్రమల నిర్మాణం, మెటీరియల్ తరలింపునకు అవసరమైన రహదారుల పనులు సాగుతున్నాయి. డీఎల్ పురంలో శుక్రవారం కారిడార్ భూముల్లో పలు యంత్రాలతో పనులు చేపడుతుండగా కొందరు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కారిడార్ నిర్వాసిత రైతులకు పూర్తి న్యాయం చేయకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

పేదరికం లేని సమాజానికే పీ4 సర్వే

- కోటవురట్ల ఎంపీడీవో కాశీవిశ్వనాథం



కైలాసపట్నం పంచాయతీలో సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కోటవురట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ స్థాపనే పీ4 సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నదని కోటవురట్ల ఎంపీడీవో కాశీవిశ్వనాథం చెప్పారు. మండలంలోని అన్నవరం, కోటవురట్ల, కైలాసపట్నం, చౌడువాడ, గొట్టివాడ, జల్లూరు కొడవటిపూడి, చినబొడ్డేపల్లి పంచాయతీల్లో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు పీ4 యాప్ ద్వారా నమోదు చేసిన సర్వే పూర్తిచేసుకున్న గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి చేసిన సర్వే నిర్వహణలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. పేదవారిని ఆర్థిక, సామాజిక రంగాల్లోపైకి తీసుకువచ్చే విధంగా పబ్లిక్‌ప్రైవేట్ పీపుల్స్ సర్వేను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ధనికులను పేదవారిని భాగస్వామ్యం చేసేందుకు ఈ సర్వేను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఇంటి పన్నులు చెల్లించిన వారికి చెత్తకుండీలను అందజేశారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా వేసి పారిశుధ్య కార్మికులకు సహకరించాలని ఆయన సూచించారు. ఇంటి పన్ను, నీటి పన్ను, భూమి శిస్తు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

చీడికలో గిరిజన గురుకుల విద్యాలయం

రూ 2.3 కోట్లు నిధులు విడుదల: కొప్పిశెట్టి వెంకటేశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్, టీడీపీ నాయకులు

నక్కపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలోని చీడిక గిరిజన గ్రామంలో గిరిజన బాలికల కోసం గిరిజన రెసిడెన్షియల్ విద్యాలయం ఏర్పాటుకు హోం మంత్రి అనిత సిఫారసుతో ప్రభుత్వం రూ.2.3 కోట్ల నిధులు మంజూరు చేసిందని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం నక్కపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎంతో కాలం నుంచి గిరిజన విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక పాఠశాల కావాలని ఈ ప్రాంత ప్రజలు అడుగుతున్నారని, హోం మంత్రి అనిత ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారని చెప్పారు. త్వరలోనే గిరిజనుల బాలికల గురుకుల భవన నిర్మాణ పనులు చీడిక గ్రామంలో ప్రారంభమవుతాయని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గం సహా జిల్లాలోని గిరిజన విద్యార్థినులకు ఇది ఎంతో ఉపయోగపడతుందని చెప్పారు. గతంలో కూడా చీడిక గ్రామానికి రహదారి నిర్మించిన ఘనత హోం మంత్రి అనితకు దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, దార్ల కృష్ణ, చీడిపల్లి దొరబాబు, కర్రి అప్పారావు, దొర పాల్గొన్నారు.

గేట్‌లో గణతేజకు పదో ర్యాంకు



జెట్టి గణతేజ

కొత్తూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గేట్ ఆలిండియా స్థాయిలో అనకాపల్లి మండలం కుంచంగి గ్రామానికి చెందిన జెట్టి గణతేజ మెకానికల్ బ్రాంచిలో పదో ర్యాంకు సాధించాడు. ఇతను విజయనగరం జేఎన్‌టీయూలో బీటెక్ చేశాడు. పబ్లిక్ సెక్టార్‌లో ఉద్యోగం సాధించడమే లక్ష్యమని గణతేజ ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి చెప్పాడు.

అశోక్‌కు 12వ ర్యాంక్



అమ్మిరెడ్డి అశోక్

రావికమతం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రివలసకు చెందిన అమ్మిరెడ్డి అశోక్ గేట్ ఫలితాల్లో 12వ ర్యాంకు సాధించారు. ఇతను కొత్తకోట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. తరువాత నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్‌లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 863 మార్కులతో 12వ ర్యాంకు సాధించాడు.

పెనుగొల్లులో లేగ దూడల ప్రదర్శన

ఎస్. రాయవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు గ్రామంలో శుక్రవారం కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. నక్కపల్లి ఏరియా పశు వైద్యశాల డాక్టర్ ఎం.వీర్రాజు ముఖ్య అతిథిగా పాల్గొని, ముందుగా లేగ దూడల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం, కృత్రిమ గర్భాధారణ, లేగ దూడల పోషణ, యాజమాన్య ఆరోగ్య పరిరక్షకు సంబంధించిన పలు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అంతకముందు 32 లేగ దూడలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాయవరం పశువైద్యాధికారి డాక్టర్ హెన్నాకుమారి, డాక్టర్ వంశీకృష్ణ, వీఎల్‌వో జనార్దనరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఎం.వీర్రాజు

విభిన్న పతిభావంతుల వసతి గృహాల్లో ప్రవేశాలు

పాయకరావుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో చేరేందుకు దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాల్లో 2025-26లో నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం మండల కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

టెన్త్ పరీక్షలకు తొమ్మిది మంది గైర్హాజరు

ఎస్.రాయవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి శుక్రవారం తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో స్వప్నప్రియారెడ్డి తెలిపారు. మొత్తం 910 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, ఇంగ్లీష్ పరీక్షకు ఎస్.రాయవరం పరీక్షా కేంద్రంలో ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఒక ప్రవేట్ విద్యార్థి, దార్లపూడి పరీక్షా కేంద్రం ఇద్దరు, కొరుప్రోలు ఇద్దరు, అడ్డరోడ్డు తిమ్మాపురం పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని ఆమె చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. 11కేవీ ఎస్.రాయవరం ఎంహెచ్‌క్యూ, ఎస్.రాయవరం రూరల్ ఫీడర్లలో ఎస్.రాయవరం టౌన్, వాకపాడు, సర్వసిద్ధి, సైతారుపేట ఆక్వా ప్రదేశాలతో పాటు బసవపాడు, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, సైతారుపేట, సర్వసిద్ధి, వేమగిరి, పేటసూదిపురం, వాకపాడు, జేవీపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

బాబ్జీరాజుకు నేతల పరామర్శ

నక్కపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేంపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కళ్లేపల్లి బాబ్జీరాజును శుక్రవారం పలువురు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ప్రస్తుతం వేంపాడులోని ఇంటి వద్దే వుంటున్న బాబ్జీరాజును వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు జి.శ్రీహరిరాజు, రేబాక గ్రామ పెద్ద ఎస్.చిన వెంకన్న పరామర్శించారు. బాబ్జీరాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శ్రీహరిరాజు గూడుపమ్మతల్లి చిత్రపటాన్ని అందజేశారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఆమోదించాలి

▸▸ అనకాపల్లిలో న్యాయవాదులు నిరసన ▸▸ స్థలాన్ని కేటాయించి కోర్టుల సముదాయ భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి



కోర్టు సముదాయాల ఎదుట నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఆమోదించాలంటూ న్యాయవాదులు శుక్రవారం ఇక్కడి మెయిన్ రోడ్డులో గల కోర్టు సముదాయాల ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అన్ని రాష్ట్రాల్లో తీసుకురావాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఉన్న కోర్టులన్నీ అద్దె భవనంలో నడుస్తున్నాయన్నారు. ఈ కారణంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్థలాన్ని కేటాయించి కోర్టుల సముదాయాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జూలై 2022లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఓ ముసాయిదా న్యాయవాదుల రక్షణ బిల్లును తయారుచేసి అన్ని రాష్ట్రాలకు పంపిందని సీనియర్ న్యాయవాది ఐఆర్ గంగాధర్ గుర్తు చేశారు. ముసాయిదా బిల్లు ఆధారం చేసుకొని రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల శాసన సభల్లో ఇప్పటికే చట్టాలను రూపొందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ వెంటనే స్పందించి ఈ బిల్లును ప్రవేశపెట్టి, చట్టంగా మార్చాలని అనకాపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణరావు కోరారు. ఈ కార్యక్రమంలో చిట్టా జయశ్రీ, బంధం వెంకటరమణ, భూపతి, ఇల్లా అవినాష్, గంటా సురేష్, కొణతాల అరుణ, కిశోర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి శ్రీవిద్య

కశింకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య అన్నారు. మండలంలోని తేగాడ కేజీబీవీ స్కూల్‌లో పోక్సో చట్టంపై శుక్రవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. వాటిని ఎప్పుడు, ఏ సమయంలో వినియోగించుకోవాలో ఆమె విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ చంద్రకళ, న్యాయవాదులు కుసుమ, రోజా తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ బలోపేతానికి నూతన అనుబంధ కమిటీలు'



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీని బలోపేతం చేసేందుకు నూతన అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి కీలకంగా పనిచేసే కార్యకర్తలకు ఈ కమిటీల్లో చోటు కల్పిస్తామన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు వెన్నెల సన్యాసిరావు, చరణ్‌రాజ్, పెదిశెట్టి శేఖర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలి'

అనకాపల్లి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమ క్వారీలపై చర్యలు తీసుకొని, భారీ లోడుతో వెళ్తున్న లారీలు అనకాపల్లి పట్టణంలోకి రాకుండా కట్టడి చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధికారులను కోరారు. శుక్రవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌ల వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్లు బీటలు వారుతున్నాయన్నారు. పంటలు, పశుగ్రాసంపై క్వారీల నుంచి దుమ్ము, ధూళి పడుతుండడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, అల్లురాజు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో డౌన్ సిండ్రోమ్ వేడుకలు

పరవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ఎం.దివాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై డౌన్ సిండ్రోమ్ గురించి వివరించారు. దివ్యాంగులకు సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్న సేవలను తెలియజేశారు. అనంతరం కోరమాండల్ టీయూఎస్ఆర్ విభాగం సమకూర్చిన పుస్తకాలు, బ్యాగ్‌లను దివ్యాంగ విద్యార్థులకు అందజేశారు. అలాగే స్మార్ట్ టీవీని భవిత కేంద్రానికి అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పాఠశాల హెచ్ఎం బి.నాగేశ్వరరావు, భవిత కేంద్రం టీచర్లు కుమారి, శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సింహాద్రి'లో కాంట్రాక్టు కార్మికులపై వేధింపులు తగదు



సంస్థ మెయిన్ గేటు ఎదుట ఆందోళన చేపడుతున్న కార్మిక నాయకులు

పరవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిపై వైద్య పరీక్షల పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సింహాద్రి కాంట్రాక్టు అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్లాంట్ మెయిన్‌గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ షుగర్, బీపీ ఉందని విధులకు వెళ్లడానికి అవకాశం లేదని కార్మికులను మానసిక ఆందోళనకు గురిచేయడం తగదన్నారు. కార్మికులను తొలగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. యూనియన్ నాయకులు పీపీ నాయుడు, పి.గోవిందరాజు, డి.రామారావు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు

పరవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ పరిధి ఫార్మా పునరావాస కాలనీలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్‌కు ఫార్మాజెల్ పరిశ్రమ యాజమాన్యం రూ.2.5 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. అనంతరం ఈ ప్లాంట్ తాళాలను శుక్రవారం పరిశ్రమ ప్రతినిధి సూర్యదేవర అప్పారావు స్థానిక నాయకుల సమక్షంలో పంచాయతీకి అప్పగించారు. ఫార్మా జెల్ పరిశ్రమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా దీనిని కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసింది. కొంత కాలం పాటు పనిచేసి మూలకు చేరింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధర్మారావు, సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు, మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, చందక గోవిందరాజు, చందక కృష్ణ, అట్టా నూకరాజు, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

79 వార్డులో దోమల నివారణకు చర్యలు

లంకెలపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధిలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్టు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం లంకెలపాలెం రామాలయం వీధి, కరణం వీధి, ఎస్సీ కాలనీ, గొడ్డి పేట, బీసీ కాలనీ, మరిడిమాంబ కాలనీ ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాల లని సూచించారు.

టీడీపీ సీనియర్ నేత దొడ్డి జగదీశ్వరరావు మృతి



జగదీశ్వరరావు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు దొడ్డి జగదీశ్వరరావు (64) శుక్రవారం కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ఇటీవల విశాఖలోని ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ అకాల మరణం పొందారు. విశాఖ నుంచి ఇక్కడి సాగి సుబ్బరాజు వీధిలోని ఆయన నివాసానికి పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. మధ్యాహ్నం ప్రారంభమైన అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు హాజరై సంతబయలులోని శ్మశానవాటిక వరకు పాడె మోశారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, కొణతాల వెంకటరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్మోహనరావు, బోడి వెంకటరావు, సబ్బవరపు గణేశ్, కాండ్రేగుల సత్యనారాయణ, పొలిమేర నాయుడు, బొడ్డేడ మురళీ తదితరులు సంతాపం తెలిపారు.

ఫార్మా పరిశ్రమల్లో ఉద్యోగులు, కార్మికులు వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

▸▸ ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు

పరవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తప్పనిసరిగా వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని మ్యూచ్‌వలీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఏఎస్ఆర్ఎం) కార్యదర్శి జెట్టి సుబ్బారావు సూచించారు. ఫార్మాసిటీలోని రాంకీ కమర్షియల్ హబ్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంకల్ప స్కీమ్‌పై ఫార్మా ప్రతినిధులు, ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు పనిపై పూర్తి అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు. పరిశ్రమల మధ్య భాగస్వామ్యం, నైపుణ్యాభివృద్ధిపై ఎలా దృష్టి సారించాలో ఆయన వివరించారు. ఈ సదస్సులో డీఆర్‌డీఏ పీడీ కె.సచీదేవి, విశాఖ ఫార్మా జనరల్ మేనేజర్ గిరిధర్‌భక్షి, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ కె.నాగరాజారావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.గోవిందరావులతో పాటు పలు ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి సహకరించాలని వినతి



పశు సంవర్థక శాఖ డీడీ చంద్రశేఖర్‌కు వినతిని అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కశింకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సమస్యలు పరిష్కరించి, వారి అభివృద్ధికి సహకరించాలని సంఘమిత్ర ఫోడర్ గ్రోయెర్స్ అండ్ ప్రొడ్యూసర్ సొసైటీ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు శిలపరశెట్టి చిట్టమ్మ, ఉపాధ్యక్షుడు ఆళ్ల అప్పలనాయుడు, డైరెక్టర్లు విల్లూరి రాజేష్, కాండ్రేగుల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం విశాఖలో ఉన్న పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్‌ను కలిసి సమస్యలను వివరించారు. మూడు, ఐదు, పది పాడి పశువులు ఉన్న రైతులను, గోకులం పథకం ద్వారా పశు శాలలను నిర్మించుకుంటున్న వారిని ఈ సొసైటీలో సభ్యులుగా చేర్పించాలని కోరారు. దీనికి రూ.15 లక్షలు షేర్ క్యాపిటల్ వసూలు అయ్యేలా చర్యలు తీసుకొని, సంబంధిత అధికారులకు సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేలు జాతి, అధిక పోషక విలువలు కలిగిన ఆధునిక బహుళ వార్షిక పశుగ్రాస విత్తనాలు తమ సంఘం తరఫున రైతులకు ఇస్తామని తెలిపారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత



పిచ్చుక గూళ్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అంతరించిపోతున్న పిచ్చుకలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇక్కడి ఎంపీ కార్యాలయంలో 'మన ఇంటి పిచ్చుకల్ని మనమే రక్షించుకుందాం' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పిచ్చుకలు జీవ వైవిధ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేస్తాయన్నారు. పక్షులను కాపాడుకుంటూ ప్రకృతి సమతుల్యతకు అందరూ పాటుపడాలని కోరారు. అనంతరం పిచ్చుక గూళ్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కార్యాలయం ఇన్‌చార్జి విజయ్‌నాయుడు, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, పెంటకోట ఉమామహేశ్వరి, బేతాళం శేషసాయి, రావూరి అనిత, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో నాణ్యమైన సేవలందించాలి

తుమ్మపాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర కోరారు. టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం 81వ వార్డు సచివాలయాన్ని ఆయన సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భోగలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ సత్యనారాయణ, ఎండపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం

కశింకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం సెక్షన్ పరిధిలో ఉన్న నర్సింగబిల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా నర్సింగబిల్లి, జె.తుని, ఎన్.జి.పాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమ్మాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం తదితర గ్రామాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఈ అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులంతా సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

27న సబ్బవరం వైస్ ఎంపీపీ-2 ఎన్నిక

▸▸ ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల ఉపాధ్యక్షుడు (వైస్ ఎంపీపీ)-2 ఎన్నిక ఈనెల 27న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎంపీపీ-2గా ఎన్నికైన అంతకాపల్లి ఎంపీటీసీ సభ్యుడు చొక్కాకుల గోవింద గత ఏడాది ఫిబ్రవరి 22న రాజీనామా చేశారన్నారు. సదరు పత్రాన్ని జడ్పీ సీఈవో ఆమోదించిన నేపథ్యంలో ఎన్నిక అనివార్యమైందని వివరించారు. మండలంలో 19 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారన్నారు. మెజార్టీ సభ్యులు చేతులెత్తి ఎవరికి మద్దతు పలికితే వారు వైస్ ఎంపీపీ-2గా ఎన్నికవుతారని తెలిపారు. ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎన్నికల అధికారిగా మండల ప్రత్యేకాధికారి కె.రమామణి వ్యవహరించనున్నారన్నారు.

దేమునిగుమ్మం శ్రీవారి ఆలయ హుండీ లెక్కింపు

అనకాపల్లి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : దేమునిగుమ్మం వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం ఆలయ మండపంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్ పర్యవేక్షణలో చేపట్టారు. 72 రోజులకు గాను భక్తుల కానుకల రూపంలో ఆరు లక్షల 22వేల 53 రూపాయలు ఆదాయం లభించిందని ధర్మకర్తల మండలి చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ ఈవో రాజసులోచన తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పులకండం గిరిబాబు, ధర్మకర్తలు గోలి మురళీ, వేదుల సూర్యప్రభ, సీహెచ్. నూకరాజు, కొణతాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

యోగా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, ప్రచారానికి కృషిచేసేందుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ అందించే ప్రధాన మంత్రి యోగా పురస్కారాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి, సెట్విస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.సత్యపద్మ ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం 20 సంవత్సరాల సేవ, అద్భుతమైన ట్రాక్ రికార్డు, యోగా ప్రచారానికి, అభివృద్ధికి సహకారం అందించిన వారు హెచ్‌టీటీపీఎస్: ఇన్నోవేటివ్ ఇండియా. ఎంవైజీఓవి.ఐఎన్/పీఎం-యోగా అవార్డు-2025 వెబ్‌సైట్ పోర్టల్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

అనకాపల్లి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ ఉద్యోగులు ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సమ్మెను వాయిదా వేశారని యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కాండ్రేగుల హరికృష్ణ తెలిపారు. యాజమాన్యం నుంచి సానుకూలమైన స్పందన వచ్చినందున సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. వారానికి ఐదు రోజుల పనిదినాలు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం, బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న సుమారు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడం, తాత్కాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయడం, సెక్యూరిటీ గార్డుల ఖాళీలు భర్తీ చేయడం వంటివి చేస్తామని తెలపడంతో సమ్మెను వాయిదా వేసినట్టు ఆయన వివరించారు.

సబ్బవరంలో చలివేంద్రం ప్రారంభం



విద్యార్థులకు మజ్జిగ అందిస్తున్న పరమేశ్వరరావు

సబ్బవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం చలివేంద్రం ప్రారంభమైంది. అమృతపురానికి చెందిన బీజేపీ నాయకులు, బూత్ సభ్యులు కండిపల్లి ఈశ్వరరావు, సామ్రాట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈచలివేంద్రాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, కొండబాబు, రెడ్డి రామునాయుడు, బి.అప్పారావు, ఆకాశ్‌కుమార్, వెంకటలక్ష్మి, గోపి, కోటి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులు

పరవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహిళల నుంచి ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పరవాడ ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు. బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్‌ల నుంచి ఆయా మహిళలకు బీసీ కార్పొరేషన్ విజయనగరంవారి ద్వారా ఈ శిక్షణ ఇవ్వనున్నారన్నారు. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 75శాతం పైగా హాజరు కలిగి ఉన్న వారికి ధ్రువపత్రంతో పాటు ఉచితంగా కుట్టు మిషన్ అందజేస్తారన్నారు. 18 నుంచి 50ఏళ్ల లోపు వయస్సు కలవారు అర్హులుగా పేర్కొన్నారు. తెల్లరేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఆధార్ కార్డు తప్పనిసరిగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయం పనిదినాల్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

బొజ్జన్నకొండ వద్ద అభివృద్ధి పనులు ప్రారంభించాలని వినతి

తుమ్మపాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి బొజ్జన్నకొండ వద్ద అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులతో డీఆర్వోను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బొజ్జన్నకొండ వద్ద లేజర్ స్క్రీన్ థియేటర్, ఫుడ్‌కోర్టు, సౌండ్ అండ్ లైటింగ్ షో పనులను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్‌గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, బండి అప్పారావు, దయాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను శుక్రవారం రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రాల నడుమ కర్రి వీర వెంకటసత్యనారాయణ, మోహన్ లక్ష్మి లావణ్య దంపతులు, కుటుంబ సభ్యులు ఆది దంపతులకు ఈ సేవను జరిపారు. ఈ సందర్భంగా మహిళా మండళ్ల చక్కని భక్తిగీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణ, శరగడం జగదీష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న లారీ పట్టివేత

సబ్బవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న లారీని వీఆర్వో రాంబాబు శుక్రవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. గంగవరం నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్టు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో తహసీల్దార్ చిన్నికృష్ణ ఆదేశాల మేరకు అజనగిరి కాలనీ వద్ద మాటు వేసినట్టు చెప్పారు. గంగవరం నుంచి గ్రావెల్ లోడుతో వస్తున్న లారీని పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్టు వీఆర్వో తెలిపారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ

సబ్బవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే పౌష్టికాహారంపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో లలితకుమారి అన్నారు. ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలంలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బందికి ఏర్పాటైన శిక్షణ శిబిరంలో పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు ఆర్.పైడితల్లి, సీహెచ్.స్వర్ణ పాల్గొన్నారు.

రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు

▸▸ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ సూర్యకుమారి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రోగులకు పీహెచ్‌సీ సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. సిబ్బంది రోగుల పట్ల మరింత స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరినందున మరమ్మతులు చేపట్టాలని, ఆసుపత్రి మెయిన్ ద్వారంపై వెంటిలేటర్‌కు గ్లాసులు ఏర్పాటు చేయాలని, ప్రతి రోజూ ఆసుపత్రి ఆవరణ శుభ్రం చేయడానికి సిబ్బంది ఏర్పాటుకు, గ్రీనరీ పెంచేందుకు, సీసీ కెమెరాల ఏర్పాటు, అవసరమైన సామగ్రి కొనుగోలుకు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ చక్రవర్తి, ఎంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ జెడ్పీటీసీ కోటనా రాము, బోకం రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ పంటల సాగుతో మేలు: ఏవో



మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుకు దూరంగా ఉంటూ సంప్రదాయ పంటలపై దృష్టిసారించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసబాబు అన్నారు. మండలంలోని కుమడ పంచాయతీ చీపురుగొంది గ్రామంలో శుక్రవారం పరివర్తన-అవగాహన సదస్సును నిర్వహించారు. గంజాయి సాగు, విక్రయాలతో కలిగే అనర్థాలపై గిరిజనులకు వివరించారు. సంప్రదాయ సాగు చేయడం ఎంతో శ్రేయస్కరమని, వాటిపై దృష్టిసారిస్తే ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోకరంగా ఉంటుందని అన్నారు. ఆరోగ్యాన్ని ఇచ్చే సాంప్రదాయ పంటలు, వాణిజ్య పంటలు, కూరగాయ సాగు చేయడం మేలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, రైతులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

తేనె సేకరణలో మెలకువలు అవసరం



తేనె సేకరణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సందీప్

చింతపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తేనె సేకరణలో గిరిజనులు ప్రత్యేక మెలకువలు పాటించాలని స్థానిక శాస్త్రవేత్త, ఫారం మేనేజర్ బీఎన్ సందీప్ నాయక్ అన్నారు. శుక్రవారం తేనెటీగల పెంపకంలో భాగంగా గిరిజన రైతులను అంతర్ల అభ్యుదయ రైతు పెరట్లో పెంచుతున్న తేనె పెట్టెల వద్ద క్షేత్ర పదర్శన ఇచ్చారు. ఈసందర్భంగా సందీప్ మాట్లాడుతూ పరికరంతో తేనెను జాగ్రత్తగా సేకరించాలన్నా రు. ఈ సేకరణ సమయంలో ఈగలు చనిపోకుండగా, తేనె పట్టు రాలిపోకుండగా చూసుకోవాలన్నారు. అనంతరం తేనెటీగలు మకరందం, పుప్పొడి సేకరణ, ప్రధాన పంటలపై ప్రొద్దుతిరుగుడు, జామ, కొబ్బరి, మామిడి, వలిసెల పంటల సాగు విధానంపై అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త జోగారావు, టీచింగ్ అసోసియేట్ బాబూజినాయుడు, టీచింగ అసిస్టెంట్ శ్వేత పాల్గొన్నారు.

చెట్టు పడి ట్రాఫిక్‌కు అంతరాయం



లారీపై విరిగిపడిన మామిడిచెట్టు

అనంతగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రా రోడ్డు రైల్వే గేటు సమీపంలో గురువారం రాత్రి (10 ఎంఎం) చిప్స్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలోని డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. శుక్రవారం ఉదయం చెట్టు ఆకస్మాత్తుగా బోల్తాపడిన లారీపై పడడంతో కొంతసేపు బొర్రా రోడ్డులోని ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. ఆ సమయంలోని ఎవరులేకపోవడం పెను ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు సాయంతో చెట్టును తొలగించడంతో వాహన రాకపోకలు యథావిధిగా సాగాయి.

డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న సీఐ హిమగిరి

అరకులోయ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పూర్తి చేసే విద్యార్థులంతా ఉన్నత చదువులపై దృష్టి సారించి సమాజాభివృద్ధికి పాటుపడాలని స్థానిక సీఐ ఎల్.హిమగిరి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 13వ వార్షికోత్సవం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ హిమగిరి మాట్లాడుతూ విద్యార్థులు మంచి వ్యక్తిత్వంతో ఎదగాలని సూచించా రు. ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు. ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు రాణించాలన్నారు. సీపీడీసీ మెంబర్స్ రామరాజు, మయూరి రాజారావు, మహిళా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ధర్మారావు, ఇక్కడి రెండు కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

నేడు మండల సమావేశం

డుంబ్రిగుడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల అభివృద్ధికి ప్రణాళికను రూపొందిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.



కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న డీఎస్పీ శ్రీసాయి ప్రశాంత్

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

» రంపచోడవరం డీఎస్పీ శ్రీ సాయి ప్రశాంత్

కొయ్యూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని రంపచోడవరం డీఎస్పీ శ్రీ సాయి ప్రశాంత్ సూచించారు. శుక్రవారం మండలంలోని యు. చీడిపాలెం పంచాయతీ పలకజీడిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా కొయ్యూరు, అడ్డతీగల, సీఐలు బి. నర్సింహమూర్తి, వి. వెంకటరమణల ఆధ్వర్యంలో మంప, వై. రామవరం, ఎస్ఐలు బి.రామకృష్ణ, కె శంకర్ పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నీమెంట్‌ను నిర్వహించారు. వైద్య నిపుణులు హేమంత్ చౌదరి, రేణుక ఆధ్వర్యంలో 800 మందికి వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాలీబాల్ టోర్నీకు కొయ్యూరుతో పాటు అడ్డతీగల, వై. రామవరం మండలాలకు చెందిన 30 జట్లు పాల్గొన్నారు. కొయ్యూరు మండలానికి చెందిన తాళ్లఎర్రగొండకు ప్రథమ బహుమతి, వై. రామవరం మండలంకోట గ్రామ జట్టు ద్వితీయ బహుమతి, మునసలపాలెం తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 8 వేలు, ద్వితీయ స్థానానికి రూ. 5 వేలు, తృతీయ బహుమతిగా రూ. 3 వేలను డీఎస్పీ అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గిరిజన ప్రాంత యువత గంజాయికి దూరంగా ఉండాలన్నారు. క్రీడల్లో రాణించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా యువతను తమ శాఖ ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాడెంట్ రాధ, పీఎస్ఐలు చక్రధర, సత్యం, సురేశ్, మహతి, గౌరీశ్వరి, చందన, లోకేశ్వరి, యు. చీడిపాలెం సర్పంచి బి. రమేశ్‌బాబు, పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. వాలీబాల్ టోర్నీలో పాల్గొన్న 30 జట్లకు సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో అందించారు. ఈకార్య క్రమం తిలకించేందుకు వచ్చిన పలు గ్రామాలకు చెందిన సుమారు 800 మందికి భోజన వసతి ని మంప ఎస్ఐ శంకర్ కల్పించారు.

ఘనంగా నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నియోజక వర్గం ఇన్‌చార్జి ఈశ్వరి

చింతపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మనుమడు దేవాన్ష్ 11వ జన్మదినాన్ని శుక్రవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పాడేరు నియోజక వర్గఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆ. ధ్వర్యంలో కేక్‌ని కట్ చేశారు. అనంతరం ఒకరినొకరు మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు,పెదిరెడ్ల బేతాళుడు,నాగభూషణం, అర్జున్,వల్లి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ

డుంబ్రిగుడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ గిరిజన యువతి, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణను కల్పించనున్నట్టు జాబ్స్‌కో-ఆర్డినేటర్ బోజ్జన్న తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సయన్వయంతో ఉన్నతి ద్వారా ఈ శిక్షణ మూడు నెలలపాటు అందిస్తామన్నారు. కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, ఆటోమోటివ్స్ రంగంలో శిక్షణ ఉంటుందన్నారు. 100 రోజుల పని దినాలు పూర్తి చేసిన జాబ్ కార్డు దారుల కుటుంబాలలోని చదువుకున్న నిరుద్యోగులకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 24న అరకులోయ వెలుగు కార్యాలయంలో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, కుల, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా, ఉపాధిహామీ జాబ్‌కార్డు నకలు, నాలుగు ఫొటోలతో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్లు

» జిల్లా అదనపు ఎస్పీ ధీరజ్



క్రీడాకారులకు నగదు, జ్ఞాపిక అందజేస్తున్న ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

గూడెంకొత్తవీధి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు పోలీసుశాఖ ద్వారా మెరుగైన ఉచిత వైద్యం అందిస్తున్నట్టు పాడేరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ధీరజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మావోయిస్టు ప్రభావిత పెద్దఅగ్రహారం గ్రామంలో జీకేవీధి పోలీసులు మెగా వైద్యశిబిరం, యువహో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. వీటిని ప్రారంభించిన అనంతరం జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న ఆదివాసీల వైద్య సేవలకోసం ప్రత్యేక వైద్యనిపుణుల సహకారంతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అగ్రహారం వైద్యశిబిరంలో 800 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలువురు రోగులను మైదాన ప్రాంతాలకు తరలించి అత్యాధునిక వైద్యం అందిస్తామన్నారు. గిరిజన యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ టోర్నమెంట్‌లో 30 క్రీడా బృందాలు పాల్గొన్నాయి. ప్రథమస్థానం సాధించిన యర్రగెడ్డ జట్టుకు రూ. 10వేలు, ద్వితీయ స్థానం సాధించిన పాములాయి జట్టుకు రూ. 5వేలు, తృతీయ స్థానంలోనిలిచిన తీములబంద క్రీడాకారులకు రూ. 3 వేల నగదుతోపాటూ జ్ఞాపికలను అందజేశామన్నారు.అనంతరం గిరిజనులతో పోలీసులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈకార్యక్రమంలో చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా, సీఐ వరప్రసాద్, ఎస్సై అప్పలసూరి, వైద్యాధికారులు వినయ్‌కుమార్, సౌమ్య పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

» 41 యూనిట్ల రక్త సేకరణ



రక్తదానంలో పాల్గొన్న యువకులు

పాడేరురూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి యువతీ, యువకుల నుంచి విశేష స్పందన లభించింది. కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏఎస్ దినేశ్ కుమార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులతో పాటు ఎన్ ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారన్నారు. గిరిజన ప్రాంతంలో రోగులు అత్యవసర సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఆదుకునేందుకు ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్టు చెప్పారు. అలాగే, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు గుర్తుగా నిఫా స్వచ్ఛంద సంస్థ, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా ఈ నెల 30వ తేదీ వరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 41 యూనిట్‌ల రక్తాన్ని సేకరించామన్నారు. ఇప్పటికూ 16 పర్యాయాలు రక్తదానం చేసిన కళాశాల విద్యార్థినిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. టీఎన్.రసూల్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు జానకీరామ్, అచ్యుతరావు, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి జి.గౌరీశంకరరావు, కోశాధికారి పి.సూర్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసాద్ నాయుడు, సంజీవరావు, రవి, సత్యనారాయణ, సుధాకర్, శ్యాంసుందర్, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలి: సీపీఎం

పెదబయలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ గృహాల యూనిట్ వ్యయం రూ. 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా లక్ష్మీపేట, అడుగులపుట్టు పంచాయితీలలోని గిరిజనులతో కలసి స్థానిక సచివాలయంలో ఆందోళన చేపట్టారు.అనంతరం వినతిపత్రాన్ని పంచాయితీ కా ర్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ జిల్లాలోని పీవీటీజీలకు పీఎం జన్‌మన్ గృహాలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. కానీ నేటి ధరలకు అనుగుణంగా యూనిట్ వ్యయం పెంచాలన్నారు సిమెంట్, ఇనుప, ఇసుక, మేస్త్రీ కూలీలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం అందిస్తున్న రూ. 2.39 సరిపోవని, దీనిని రూ. 10 లక్షలకు పెంచాలన్నారు. ఇసుకనుఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పథకం వేతనాలు విడుదల చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు బొండా సన్నిబాబు , గిరిజనులు ఉన్నారు.

'పది' పరీక్షలకు 99.23 శాతం మంది హాజరు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాడేరురూరల్, మార్చి 21 (ఆంధ్ర జ్యో తి): జిల్లాలోని 22 మం డలాల్లో 71 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం(3వ రోజు) ఇంగ్లీషు పరీక్షకు 99.23 శాతం మంది వి ద్యార్థులు హాజరైనట్టు జి ల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (ప్రభుత్వ పరీక్షలు) శశికుమార్ తెలిపారు. ఇంగ్లీషు పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 11,547 మంది హాజరు కావాల్సి ఉండగా 11,458 (99.23) శాతం మంది రాశారన్నారు. 89 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 10 మందికి ఐదుగురు (50)శాతం మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారన్నారు. దీంతో మూడవ రోజు జిల్లా వ్యాప్తంగా మొత్తం 94 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీవోఎస్ఎస్) ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పది పరీక్షల్లో మూడవ రోజు జరిగిన ఇంగ్లీషు పరీక్షకు 86.41 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్టు చెప్పారు. ఈ పరీక్షకు 1,207 మంది హాజరు కావాల్సిన 1,043 మందిలో.. 164 మంది గైర్హాజరైనట్టు వారు వివరించారు.

నేడు చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల వివరాలు నమోదు

పాడేరురూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల వివరాలను నమోదు చేస్తున్నట్టు జిల్లా పరిశ్రమ అధికారి రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే అయిన యూనిట్లను రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. అన్ని వ్యాపార, పరిశ్రమల, సేవారంగ సంస్థలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే, మండలంలోని లబ్ధిదారులు ఫోన్ నంబరు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా కాపీలతో ఈ నెల 22వ తేదీ శనివారం పాడేరు ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నమోదు చేపడతామన్నారు. ఈ రిజిస్ట్రేషన్ వల్ల పరిశ్రమలకు బ్యాంక్ రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు పొందవచ్చని తెలిపారు. ఈ నెల 22న రంపచోడవరం ఐటీడీఏలో జరపాల్సిన ఉద్యమ వర్క్‌షాప్‌ను అనివార్యకారణాల వల్ల పాడేరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



ఏగకంతవరంలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి, ఎంపీటీసీ సభ్యుడు

జి.మాడుగుల, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సొలభం ఎం చా యతీ ఏగ కంతవరం పాఠశాల భవనాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు చిన్నారావు, సర్పంచి హనుమంతరావు శుక్రవారం ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని ఇటీవల ప్రజా ప్రతినిధుల కృషితో మరమ్మతులు చేపట్టి యథాతథ స్థితికి తీసుకురావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముత్యాలమ్మ జాతరకు ప్రభుత్వ పరంగా సహకారం



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ జాతర విజయవంతానికి ప్రభుత్వ పరంగా సహకారం ఉంటుందని టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక అమ్మవారి మైదానంలో మేజర్ పంచాయతీ సర్పంచి దురియా పుష్పలత అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరావు, ఈశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు, వివిధ సంఘాలు, రాజకీయ నాయకుల సహకారంతో ఘనంగా ఈ జాతర నిర్వహించేందుకు సహకరిస్తానన్నారు. నిధులు సమీకరణ కృషిచేస్తానన్నారు. ఈనెల 24 నుంచి 27 వరకు నిర్వహించే జాతరలో పారిశుధ్యం, తాగు నీరు, ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా హేమత్‌కుమార్, వినాయకరావు

ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి వినాయకరావుని ప్రకటించారు. ఇతర కార్యవర్గాన్ని గ్రామ ప్రజలతో చర్చించి నియమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు. ఈకార్యక్రమంలో జడ్పీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనుషదేవి, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు, సోమేశ్, నాగభూషణం, గ్రామ పెద్దలు రహీమ్, తిరుపతిరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు

» జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



ముంచంగిపట్టు సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే , జడ్పీ చైర్‌పర్సన్

ముంచంగిపుట్టు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)కు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని అరకు నియోజక వర్గం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగ అన్నారు. స్థానిక సీహెచ్‌సీని ఎమ్మెల్యేతో పాటు విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చికిత్సపొందతున్న భల్లుగుడకు చెందిన చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి పూర్తిస్థాయి వైద్యం అందించాలని వైద్యులకు తెలిపారు. మందులు కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీహెచ్‌సీలో పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామాల్లో ఎవరూ నాటు వైద్యం జోలికి ఎవరూ వెళ్లరాదని, వ్యాధులు సోకితే ఆస్పత్రికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం నేత జేవీవీఎస్ మూర్తి, నాయకులు జగబందు, సుబ్బలక్ష్మి, కమల తదితరులు పాల్గొన్నారు.

186 మందికి కంటి పరీక్షలు



చిన్నారికి నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అరకులోయ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అరకులోయలో విశాఖ శంకర్ ఫౌండేషన్, అరకులోయ తేజమెడికల్ స్టోర్స్ సంయుక్తంగా శుక్రవారం ఏర్పాటుచేసిన ఉచి త నేత్ర వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ప్రారంభించారు. 186 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 8 నెలలు నిండిన కుపమ అనే చిన్నారి వైద్య పరీక్షలు చేసి కంట్లో గ్లకోమా వ్యాధి ఉన్నట్టు వైద్య నిపుణులు సమృద్ధి దేశ్‌ముఖ్ నిర్ధారించారు. ఈ చిన్నారిని అవసరమైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైద్యులను కోరారు. ఇందుకు అవసరమైన ఖర్చును భరిస్తానని తేజ మెడికల్ స్టోర్స్ యజమాని గెడ్డం నరసింగరావు భరించేందుకు ముందుకు రావడంతో అతనని ఎమ్మెల్యే ఎ అభినందించారు. ఈశిబిరంలో 22 మందికి కళ్లద్దాలు , 8మందికి కంటి అపరేషన్లు అవసరంగా గుర్తించారు. వీరందరికి ఉచితంగా వైద్యసేవలందిస్తామన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ



కేజీబీవీలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మాణిక్యం

అనంతగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు కేజీబీవీ, శివలింగపురం పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ వీ మాణిక్యం శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు క ల్పించిన సౌకర్యాలపై అడిగితెలుసుకున్నారు. మాస్‌కాపీయింగ్ తావు లేకుండా చూడాలని ఉపా ధ్యాయులకు, పరీక్ష కేంద్రం చీఫ్‌కు సూచించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కి గుండెపోటు

» అంగన్‌వాడీల శిక్షణ శిబిరంలో అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు



చికిత్సపొందుతున్న సత్యవతి

చింతపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉంటుండగా ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ సీహెచ్. సత్యవతి ఆకస్మికంగా గుండెపోటుకులోనై అస్వస్థత పాలయ్యారు. మండల కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిపై అవగాహన కల్పిస్తుండగా ఒక్కసారిగా సత్యవతి నేలకొరిగిపోయారు. వెంటనే సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలనంతరం ఆమెకు గుండెపోటు వచ్చినట్టు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆమెను మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మద్యం, సారాతో పట్టుబడిన ఐదుగురిపై బైండోవర్ కేసు

చింతపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మద్యం, సారాతో పట్టుబడిన ఐ దుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ కూర్మారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాజంగి, బురిసింగి, చింతపల్లిలో దాడులు నిర్వహించగా ఐదుగురు 14 లీటర్ల సారా, ఎనిమిది మద్యం సీసాలతో పట్టుబడ్డారన్నారు. ఈ మేరకు వారికి కౌన్సెలింగ్ చేసి భవిష్యత్తులో సారా తయారీ, మద్యం విక్రయాలు చేపట్టరాదని సూచించామన్నారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్ ఎదుట హాజరుపరిచామన్నారు.


పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న పీవీఎస్ఎన్ రాజు

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

▸▸ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గంలో సమస్యల పరిష్కారానికి కూటమి పార్టీల నేతలతో సమన్వయంతో పనిచేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు సూచించారు. చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల జనసేన పార్టీ ముఖ్య నాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఠాపురం సభకు సమన్వయకర్తగా వ్యవహరించే అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని అసంపూర్తిగా ఉన్న రోడ్లు, వడ్డాది, విజయరామరాజుపేట వంతెనల నిర్మాణం, మంగళాపురం ఆనకట్ట, చెరకు రైతుల సమస్యల పరిష్కారం కోసం కూటమి నేతలతో కలిసి పని చేయాలని సూచించారు. తమకు మద్దతుగా నిలిచిన ప్రజలకు పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ సందర్భంగా పిఠాపురంలో పార్టీ ఆవిర్భావ సభ విజయవంతానికి కృషి నేతలను పవన్ అభినందించారని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు, మండల నాయకులు గూనూరు మూలినాయుడు, కర్రి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముషిడిపల్లిలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు


ముషిడిపల్లిలో రికార్డులు తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

దేవరాపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సేవలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ వైద్య బృందం ఆరా తీసింది. మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో కొంత మంది గర్భిణులు, బాలింతలు, కౌమార దశ పిల్లల ఇళ్లను ఈ బృందం ప్రతినిధులు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్య సిబ్బంది చేసిన రక్త పరీక్షలు, బీపీ, డయాబిటిస్ తదితర తనిఖీలను పరిశీలించారు. అలాగే ఈ వివరాలు నమోదు చేసిన వైద్య సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం హెల్త్ వెల్ నెట్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని బృందం ప్రోగ్రాం అధికారి ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీశ్, రామచంద్ర, దేవరాపల్లి వైద్యాధికారి పూజితా మేఘన పాల్గొన్నారు.

జిల్లేడిపూడి నూకాంబికా జాతరకు ఏర్పాట్లు


జాతరకు ముస్తాబైన అమ్మవారి ఆలయం

నాతవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేడిపూడిలో నూకాంబికా కొత్త అమావాస్య జాతరకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. స్థానికులతో పాటు అనకాపల్లి, కాకినాడ జిల్లాల భక్తులు అమ్మవారి దర్శనానికి భారీగా తరలివస్తారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకుని ఇక్కడే వంటలు చేసుకుని భోజనాలు ఆరగించి తిరిగి వెళ్లారు. ఈసారి కూడా భక్తులు అధికంగా తరలివస్తారనే అంచనాతో అందుక తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. నాతవరం, నర్సీపట్నం పోలీసులు భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. కాగా శుక్రవారం నుంచి అమ్మవారి గరగలను ఊరేగిస్తున్నారు.

చీడిగుమ్మలలో మజ్జిగ చలివేంద్రం


చీడిగుమ్మల గ్రామంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం

గొలుగొండ మార్చి, 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల గ్రామంలోని సిద్ధివినాయకుడి ఆలయం వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కావడంతో ప్రజలకు మజ్జిగ అందిస్తున్నట్టు కార్యదర్శి గౌరి తెలిపారు. ఈ అవకాశాన్ని పాదచారులు, వాహన చోదకులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సత్తిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థుల కోసం సత్యసాయి సేవా సంస్థలు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాయి. కింతాడ శివారు కూండ్రపువాని పాలెం భక్తులతో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, సభ్యుడు కన్నూరు. అప్పలనాయుడు, బీవీఎస్ వేణు, చందు, శేఖర్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

రోలుగుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో సభ్య రైతులతో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పీఏసీఎస్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా, రుణాల మంజూరు, జమ గురించి సీఈవో మహేశ్ వివరించారు. సభ్యులకు ఎకరా చెరుకుకు రూ.లక్ష, వరికి రూ.50 వేలు రుణం మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు రుణం మంజూరుకు డిక్లరేషన్‌కు రూ.100 మాత్రమే తీసుకునేవారని, కొత్తగా యూజర్ చార్జీలు వసూలు చేసి సుమారు రూ.500 చాలానా కట్టించుకుంటున్నారని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి జగన్నాథరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పరిధిలోని పలు గ్రామాల సభ్య రైతులు పాల్గొన్నారు.

రాచపల్లిలో దొంగతనం

మాకవరపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో రుత్తల కబీర్ ఇంట్లో గురు వారంరాత్రి జరిగిన దొంగతనంలో రెండు తులాల బంగారం, రూ.20 వేలు నగదు అపహరణకు గురయ్యాయి. అలాగే రూ.3 లక్షల బ్యాంకు డిపాజిట్ బాండ్లు చోరీకి గురయ్యాయని బాధితుడు తెలిపారు. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లి సాయంత్రం వచ్చి చూసే సరికి ఇంటి తాళలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వచ్చి ఇంటిని పరిశీలించి క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ.దామోదర్‌నాయుడు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత

కృష్ణాదేవిపేట 24 గంటల పీహెచ్‌సీలో ఒక వైద్యాధికారి, ఇద్దరే స్టాఫ్‌నర్సులు!

▸▸ ప్రతి రోజూ 150 నుంచి 200 వరకు ఓపీ

▸▸ రోగుల అగచాట్లు.. తగ్గుతున్న డెలివరీలు

▸▸ పట్టించుకోని ఉన్నతాధికారులు



కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కృష్ణాదేవిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. 24 గంటలూ పనిచేసే ఈ కేంద్రంలో ఒక డాక్టరే విధులు నిర్వర్తిస్తుండడం.. సిబ్బంది కూడా అరకొరగానే ఉండడం వెరసి రోగులు నరకం చూడాల్సి వస్తోంది. అయినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారుల్లో చలనం లేకపోతోంది.

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీలో వైద్యాధికారి, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యాధికారి ఎస్.హరిప్రవీణ్ 20 రోజులు క్రితం ఉన్నత చదువుల కోసం వెళ్లిపోయారు. నలుగురు స్టాఫ్‌నర్సులు ఉండవల్సి ఉండగా, ఇద్దరే ఉన్నారు. వైద్యాధికారి, సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో గ్రామీణ సబ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, పీహెచ్‌ఎన్, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందిని ఇక్కడికి తాత్కాలికంగా రప్పిస్తున్నారు.

గిరిజన, మైదాన ప్రాంతాలకు ముఖ ద్వారమైన ఈ పీహెచ్‌సీలో ప్రతి రోజూ 150 నుంచి 200 వరకు ఓపీ ఉంటుంది. ఐదేళ్ల క్రితం సుమారు 15 మందికిపైగా వైద్య సిబ్బంది ఉండేవారు. వైసీపీ పాలనలో ఈ సంఖ్యను 11 మందికి కుదిరించారు. దీంతో ఇక్కడ సేవలు అందించిన పలువురు సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోయారు. అయినప్పటికీ ఇద్దరు వైద్యాధికారులతో కలిపి 11 మంది వైద్య సిబ్బందిలో ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఒక వైద్యాధికారి, స్టాఫ్‌నర్సు, నైట్ వాచ్‌మన్ లేకపోవడంతో శోచనీయం. దీంతో రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. అలాగే రోజురోజుకూ డెలవరీల సంఖ్య తగ్గిపోతోంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల కోసం గత్యంతరం లేక నర్సీపట్నం వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యలపై ఇప్పటికే జిల్లా అధికారులకు తెలిపినా ఫలితం లేకపోతోంది. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గిరిజన, మైదాన ప్రాంతాల రోగులు, ప్రజలు కోరుతున్నారు. ఏదేమైనా ఇక్కడ వైద్యాధికారి, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.

గిరిజనుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా లేటరైట్ తవ్వకాలు వద్దు

▸▸ సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం


అసనగిరి గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న కె.లోకనాథం, సీపీఎం నాయకులు

నాతవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సుందరకోట పంచాయతీ శివారు భమికలొద్దు ప్రాంతంలో గిరిజనుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా లేటరైట్ తవ్వకాలు జరపవద్దని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. అసనగిరి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి గిరిజనులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యావరణ, గిరిజన చట్టాలను ఉల్లంఘించి అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని, దీంతో అటవీ ప్రాంతం ధ్వంసమైందని చెప్పారు. నేడు టీడీపీ ప్రభుత్వం కూడా లేటరైట్ తవ్వకాలకు పాల్పడుతుండడం సరికాదన్నారు. లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం వల్ల 16 గ్రామాల గిరిజనులు సర్వం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో చట్టాలను కాపాడకుండా లేటరైట్ తవ్వకాలు ఎలా చేపడతారని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ లీజుదారుడు జర్తా లక్ష్మణరావు గిరిజనేతరుడు అన్న ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యులు లోతా రామారావు, అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, పి.నూకరాజు పాల్గొన్నారు.

వారపు సంత ఆశీలు పాటలో గందరగోళం

▸▸ సిండికేటుగా మారిన ఏర్పడిన పాటదారులు


సంత ఆశీల పాటలో పాటదారుల వాగ్వాదం

మాడుగుల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వారపు సంత ఆశీళ్ల పాటలో గందరగోళం ఏర్పడింది. స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన సచివాలయంలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాట సాగింది. పాటదారుల నుంచి రూ.2.5 లక్షల డిపాజిట్‌తో పాటు సాల్వెన్సీ సర్టిఫికెట్లను పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు పర్యవేక్షణలో సిబ్బంది కట్టించుకున్నారు. అనంతరం రెండు గంటల నుంచి ఆశీళ్ల పాట నిర్వహించారు. వేలం పాట ప్రారంభ దశలోనే టీడీపీ పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, సూర్యనారాయణరాజు, జనసేన నాయకుడు రొబ్బా మహేశ్ తదితరులు మాట్లాడుతూ గత ఏడాది పాటదారుడు కట్టాల్సిన పాత బకాయి రూ.2.5 లక్షలు చెల్లించిన తరువాత పాట నిర్వహించాలని పట్టుబట్టారు. పంచాయతీ నిర్ణయించిన ధర కంటే పది రెట్లు వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేసి కూడా బకాయి పెట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. గతంలో పాటదారుడి నుంచి సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకోకుండా పాట నిర్వహించడం వల్ల పాతబకాయి వసూలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీంతో వైసీపీ మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య కార్మికుల జీతాలు ఇవ్వాలంటే పంచాయతీ ఆదాయం పెంచాలని, గత ఏడాది కూడా పంచాయతీ నిబంధనలు పక్కనపెట్టి ఆశీళ్ల పాటదారులు అధికంగా వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో రూ.8.8 లక్షలకు పాడుకున్నారని, ఇప్పుడు పంచాయతీ ధరలకు అనుగుణంగా ఆశీళ్లు వసూలు చేయాలంటే పాటదారులు ముందుకురారని, పంచాయతీ ఆదాయానికి గంగండిపడి అభివృద్ధికి నోచుకోదని పేర్కొన్నారు.

కొంతమంది స్పందిస్తూ వ్యాపారుల జేబులకు చిల్లుపడినా పర్వాలేదుగాని, ఆశీళ్ల పాటదారులు జేబులు మాత్రం నిండిపోవాలంటారా అని ప్రశ్నించారు. దీంతో నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. పంచాయతీ కార్యదర్శికి ఏం చేయాలో అర్థం కాక నాయకులు చెప్పిన మాటకు తలొగ్గి గత ఏడాది పాటపై ఐదు శాతం పంచాయతీ నిబంధనలు ప్రకారం కలిపి గ్రామానికి చెందిన వ్యక్తికి కట్టబెట్టారు.

సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డి పీఎల్ సతీశ్‌కుమార్, పంచాచతీ కార్యదర్శి మూర్తిబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ పాటకు 21 మంది రూ.2.5 డిపాజిట్ చేసుకున్నారు. పాటదారులు సిండికేట్ కావడంతో గత ఏడాది కంటే రూ.9.24 లక్షలకు పాటని నిర్ణయించడంతో గ్రామానికి చెందిన మాటూరు కొండాజీ కైవసం చేసుకున్నారు. వెంటనే ధరల పట్టికను ఏర్పాటు చేస్తామని, నిబంధనలు అతిక్రమించి వసూలు చేస్తు పాటదారులు పాటని రద్దు చేసి వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

అప్రమత్తతోనే క్షయ వ్యాధి నిర్మూలన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

నర్సీపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే పూర్తిగా తగ్గిపోతుందని అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ చాందిని దివ్యశ్రీ అన్నారు. శుక్రవారం ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి అర్బన్ పీహెచ్‌సీలలో సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'అవును క్షయ వ్యాధిని అంతం చేయగలం, కట్టుబడి ఉండండి' అన్న నినాదంతో ఈ ఏడాది ప్రపంచ టీబీ దినోత్సవం నిర్వహించు కుంటున్నామని తెలిపారు. క్షయ వ్యాధి ఊపిరితిత్తుల మీద తీవ్ర ప్రభావం చూపిస్తుందని అన్నారు. ఇందులో రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, ఛాతీ నొప్పి, రక్తంతో కూడిన వాంతులు టీబీ లక్షణాలుగా భావించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి, టీబీ విభాగంలో వైద్యం చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని, దగ్గినప్పుడు నోటి దగ్గర అరచేతిని అడ్డు పెట్టుకోవాలని ఆమె సూచించారు.

రీజనల్ ఫెయిర్‌ను రైతులు వినియోగించుకోవాలి

బుచ్చెయ్యపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఆధునిక సాంకేతికతను రైతులకు తెలియపరిచే విధంగా ఈ నెల 27 నుంచి జరగనున్న రీజనల్ ఫెయిర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొండెంపూడి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆధునిక సాంకేతికతను తెలుసుకోవాలని ఆయన కోరారు.

'వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి'

బుచ్చెయ్యపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినభీమవరం గ్రామంలోని తన వ్యవసాయ భూమిలో పంటను ధ్వంసం చేసిన బీభత్సం సృష్టించిన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు వెలంకాయల గోవింద నాయుడు గురువారం ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నంబరు 258లో 6, 7 సుమారు 2.3 సెంట్ల డి ఫారం పట్టా కలిగిన తన భూముల్లో కంచె తొలగించి కొబ్బరి మొక్కలు, డ్రిప్ పైపులు, కంచె నాశనం చేశారని బాధితుడు పేర్కొన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసినా, ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీన్ని ఆసరాగా చేసుకుని మరలా తన భూమిలోకి వచ్చి దౌర్జన్యం చేయడానికి చూస్తున్నారని తెలిపారు. వైసీపీ నాయకులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఎస్పీకి వినతిపత్రం అందించారు.

గేట్‌లో అశోక్‌కు 12వ ర్యాంక్


అమ్మిరెడ్డి అశోక్

రావికమతం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్రివలసకు చెందిన అమ్మిరెడ్డి అశోక్ గేట్ ఫలితాల్లో 12వ ర్యాంకు సాధించారు. ఇతను కొత్తకోట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. తరువాత నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్‌లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 863 మార్కులతో 12వ ర్యాంకు సాధించాడు.

నాటుసారా, మద్యం సీసాలు ధ్వంసం


సారాను ధ్వంసం చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాడుగుల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతంలో పట్టుబడిన నాటుసారా, మద్యం సీసాలను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశారు. 22 నాటుసారా కేసులకు సంబంధించి 143.25 లీటర్ల సారా ధ్వంసం చేశారు. అలాగే ఇటీవల కల్లు గీత కార్మికులకు కేటాయించి ఏర్పాటు చేసిన మాడుగుల, చీడికాడ, రామికమతంలోని మద్యం దుకాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బందవీధి తాగునీటి బోరులో బురద నీరు



తాగునీటి బోరు నుంచి వస్తున్న బురద నీరు

చీడికాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం శివారు బందవీధి గిరిజన గ్రామంలో బోరు నుంచి బురదనీరు వస్తోంది. రెండు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో పలువురు జ్వరాలతో బాధ పడుతున్నారు. శుక్రవారం ఈ బురద నీటిని విలేకరులకు చూపించారు. ఈ నీటిని రెండు నెలలుగా తాగడం వల్ల అనారోగ్యానికి గురయ్యామన్నారు. ప్రస్తుతం కొర్రా సుబ్బారావు, కొర్రా పార్వతి, కొర్రా మరియమ్మ, పుష్ప, ప్రవీణ్ జ్వరంతో బాధపడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం దేని చెప్పారు. క్రాష్‌ప్రోగ్రాం నిర్వహించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు అన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

చీడికాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు కోరారు. చీడికాడ నూకాలమ్మ దేవాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన తహసీల్దార్ కిశోర్ లింకన్, ఎంపీడీవో హేమసుందరావును సత్కరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు పి.బాలకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, ఆర్.కొండబాబు, సిహెచ్.శివాజీ రాజు, పి.అప్పలనాయుడు, ఎస్.రమణమ్మ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల దారి దోపిడీ

భయాందోళనలో వాహన చోదకులు ప్రయాణికులు

నర్సీపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాలలో కేటుగాళ్లు మెయిన్ రోడ్డులో కాపుగాసి సెల్ ఫోన్లు కొట్టేస్తున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మసాగరం కూడలి సమీపంలో దారి కాసి సెల్ ఫోన్ చోరీ చేసిన ఉదంతం శుక్రవారం జరిగింది. బాధితులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎండపల్లికి చెందిన కళ్లెంపూడి అచ్చెయ్యనాయుడు టీవీఎస్ మోపెడ్ మీద నర్సీపట్నం వస్తున్నాడు. ధర్మసాగరం కూడలి సమీపంకి వచ్చేసరికి అతని వెనక బైక్ మీద వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో వెనక కూర్చున్న వ్యక్తి అచ్చెయ్యనాయుడు చొక్కా జేబులోంచి సెల్‌ఫోన్ లాగేశాడు. బాధితుడు కేకలు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇటువంటి సంఘటనే గత శుక్రవారం గిడుతూరు వద్ద జరిగింది. నర్సీపట్నానికి చెందిన టీవీ రిపోర్టర్ కడిమిశెట్టి తాతాజీ బైక్‌పై వెళుతుండగా, వెనక నుంచి మరో బైక్ మీద వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో వెనక కుర్చున్న వ్యక్తి తాతాజీ చొక్కా జేబులో నుంచి సెల్ ఫోన్ లాగేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

27న రాయపరాజుపేట ఉప సర్పంచ్ ఎన్నిక

చోడవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికను ఈ నెల 27న నిర్వహించనున్నట్టు ఈవోపీఆర్‌డీ ఒ.మహేశ్ శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

మాకవరపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. 'మల్లవరంలో దాహం కేకలు' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. మంచినీటి పథకం నుంచి బీసీ కాలనీకి వెళ్లే తాగునీటి పైపులైన్ పూర్తిగా పగలిపోవడంతో బీసీ కాలనీలో తాగునీటి సమస్య ఏర్పడిందని గుర్తించామన్నారు. అలాగే కొందరు వ్యవసాయ భూములకు తాగునీటిని మళ్లిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం మల్లవరంలో తాగునీటి సమస్యపై ఇప్పటికీ స్పందించకపోవడం గమనార్హం.

ఘంటసాల ఆరాధనోత్సవాలు రేపు

చోడవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ రహమతుల్లా, డాక్టర్ రామమూర్తి శుక్రవారం తెలిపారు. ఈ ఆరాధనోత్సవాల్లో భాగంగా ఘంటసాల పాటలతోనే పూర్తిగా ఘంటసాల జీవిత చరిత్ర, బుర్రకథ, హరికథ, నృత్యాలు, గానలహరి కార్యక్రమాలు ఉంటాయని వారు చెప్పారు.

బాలల ఆరోగ్యంపై అంగన్‌వాడీలకు శిక్షణ

రోలుగుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల విద్య, ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. రోలుగుంట, బుచ్చెంపేట సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ బీ, పడాయి బీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న బాల, బాలికలకు విద్య, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ చిన్నారికి కనీసం రెండు గంటల పాటు నాణ్యత గల ప్రీ స్కూల్ బోధన అందించాలని ఈ సందర్భంగా సీడీపీవో పుష్పాదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.రమ్య, ఎన్.హేమావతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రిషబ్ పంత్

విశాఖపట్నం-స్పోర్ట్సు/గోపాలపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెల 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు శుక్రవారం నగరానికి చేరుకుంది. రాత్రి 7.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లు అక్కడ నుంచి ప్రత్యేక బస్సులలో హోటల్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌తోపాటు డేవిడ్ మిల్లర్, మార్‌క్రమ్, హిమ్మత్ సింగ్, మాథ్యూ బ్రీజ్‌టెక్, నికోలస్ పూరన్, ఆర్యన్ జుయల్, మిచెల్ మార్ష్, అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్, యువరాజ్ చౌధరి, రాజ్‌వర్ధన్ హంగ్రేకర్, అర్షిన్ కులకర్ణి, ఆయుష్ బదోని, అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్, సిద్దార్థ్, దిగ్వేష్ సింగ్, ఆకాశ్ సింగ్, షమర్ జోసెఫ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, మొహిసిన్ ఖాన్, రవి బిష్ణోయ్, మరో 25 మంది సపోర్టింగ్ సిబ్బంది విశాఖ చేరుకున్నారు. శని, ఆదివారాల్లో నెట్ ప్రాక్టీస్ చేసి సోమవారం రాత్రి 7.30 గంటలకు ఢిల్లీ క్యాపిటల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనున్నారు.

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు 31న లోకేశ్ శంకుస్థాపన

- రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ


విజయవాడ కార్యాలయంలో సమావేశమైన ప్రగడ, సుందరపు , ఎండీ శ్రీనివాసరెడ్డి

అచ్యుతాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి- అచ్యుతాపురం రహదారి విస్తరణ పనులకు ఈ నెల 31వ తేదీన మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసరెడ్డితో సమావేశమై రోడ్డు గురించి చర్చించారు. అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటైన తరువాత అచ్యుతాపురానికి ప్రాధాన్యత ఏర్పడిందని, అనకాపల్లి- అచ్యుతాపురం మధ్య నాలుగు లేన్ల రహదారి అవసరమన్నారు. ఇంకా ఎలమంచిలి-అచ్యుతాపురం, పరవాడ-అచ్యుతాపురం రహదారులను కూడా విస్తరించాల్సిన అవసరం వుందన్నారు.

గోవాడ షుగర్స్‌కు ఆగిన చెరకు రవాణా

- బకాయిలు మొత్తం చెల్లించాలని లారీ ఆపరేటర్ల డిమాండ్
- రెండు రోజుల నుంచి చెరకును అన్‌లోడ్ చేయని పరిస్థితి


ఫ్యాక్టరీ ఆవరణలో చెరకు లారీలు

చోడవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు రవాణా డబ్బులు పూర్తిస్థాయిలో చెల్లించే వరకు లారీలను నడిపేది లేదంటూ ఆపరేటర్లు స్పష్టం చేశారు. గురువారం ఉదయం కాటాల నుంచి ఫ్యాక్టరీకి చెరకు తీసుకువచ్చిన వచ్చిన లారీల నుంచి అన్‌లోడ్ చేయకుండా ఆవరణలోనే వుంచేశారు. మరోవైపు కాటా నుంచి చెరకు తీసుకురావడాన్ని ఆపేశారు. ఫ్యాక్టరీ ఆవరణలో రెండు రోజుల నుంచి లారీల్లోనే వున్న చెరకు ఎండిపోతుండగా, కాటాల వద్ద నుంచి చెరకు తరలించే అవకాశం కూడా లేకపోవడంతో అక్కడ కూడా చెరకు ఎండిపోతున్నది. లారీ ఆపరేటర్ల ఆందోళనతో గురువారం రాత్రి స్పందించిన ఫ్యాక్టరీ అధికారులు... ఫిబ్రవరి నెలాఖరు వరకు రవాణా చార్జీలు రూ.18 లక్షలు చెల్లించారు. అయితే ఇప్పటి వరకు చెరకు రవాణా చేసిన చార్జీలు సైతం చెల్లించాలని ఆపరేటర్లు పట్టుబట్టారు. అంతవరకు లారీల నుంచి చెరకు అన్‌లోడింగ్ చేసేది లేదని స్పష్టం చేశారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు, సీఐ బి.అప్పలరాజు, లారీల ఆపరేటర్లతో మాట్లాడారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కాటాల నుంచి చెరకును ఫ్యాక్టరీకి తీసుకురావడానికి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

5న భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. వచ్చే నెల ఆరో తేదీన సీతారాముల కల్యాణం జరగనున్న నేపథ్యంలో ఐదో తేదీ ఉదయం 6.00 గంటల నుంచి బస్సులు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రెండు గంటలకు ఒక ప్రత్యేక బస్సు ఆపరేట్ చేయాలని ప్రణాళిక తయారు చేశామని, ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా అవసరమైనన్ని ఆపరేట్ చేస్తామని ఆయన వెల్లడించారు. విశాఖ నుంచి సూపర్ లగ్జరీ సర్వీస్‌లో సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లేందుకు రూ.600, రాజమండ్రి మీదుగా భద్రాచలం వెళ్లేందుకు రూ.700 చార్జీగా నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు. ఆర్టీసీ వెబ్‌సైట్, రిజర్వేషన్ కౌంటర్, అథరైజ్డు ఏజెన్సీల నుంచి సీట్లు రిజర్వు చేసుకోవచ్చునని ఆర్ఎం తెలిపారు.

రెండు లారీలకు రూ.92 వేల జరిమానా

మునగపాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి వైపు నుంచి అచ్యుతాపురం వైపు బండరాళ్లను పరిమితి మించి రవాణా చేస్తున్న రెండు లారీలను మునగపాక జంక్షన్ వద్ద పట్టుకున్నట్టు ఎస్.ఐ పి.ప్రసాదరావు తెలిపారు. అనంతరం ఈ విషయాన్ని ఆర్టీవో దృష్టికి తీసుకెళ్లగా.. ఒక్కో లారీకి రూ.46 వేల చొప్పున జరిమానా విధించారని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వాలి

- మాంసం, కూరగాయల ఉత్పత్తి క్లస్టర్‌గా జిల్లా
- వచ్చే ఏడాదికి 17 శాతం వృద్ధి
- కలెక్టర్ విజయకృష్ణన్


డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లాను మాంసం, కూరగాయల ఉత్పత్తి క్లస్టర్‌గా ప్రకటించినందున వ్యవసాయ, డెయిరీ, పౌల్ట్రీ రంగాలకు బ్యాంకులు విరివిగా రుణాలు అందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ త్రైమాసిక సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాంసం, కూరగాయల ఉత్పత్తిలో వచ్చే సంవత్సరానికి 17 శాతం వృద్ధి రావాలని అందుకు అనుగుణంగా యూనిట్లు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. యువతకు ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చి యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహించాలని, ఆయా యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పశువులు, గొర్రెలు, నాటుకోళ్ల పెంపకం, మైదాన ప్రాంతంలో కూరగాయల సాగు పెంచాలన్నారు. కౌలు రైతులకు కూడా పంట రుణాలు అందించాలని అన్నారు. ఉన్నత విద్యకు రుణాలు ఇవ్వాలని, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఆయా శాఖల అధికారులు, బ్యాంకుల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వ్యవసాయ, అనుబంధ రంగాలను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వస్తువులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు.

పీ-4 సర్వే 99.86 శాతం పూర్తి: కలెక్టర్

అనకాపల్లి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా దాతృత్వ ప్రజల భాగస్వామ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీ-4 సర్వేకు సంబంధించి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సర్వే ఈ కార్యక్రమం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన 20 శాతం మందిని ఆర్థికంగా సంపన్నులైన పది శాతం మంది మద్దతుతో శక్తివంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. జిల్లాలో పీ-4 సర్వే 99.86 శాతం పూర్తయిందని తెలిపారు.

దేవదాయ శాఖకూ ఆర్టీఐ వర్తిస్తుంది

- దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వకపోతే చర్యలు తప్పవు
- ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్


వర్చువల్‌గా మాట్లాడుతున్న ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్

కొత్తూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ పరిపాలన విభాగాల్లో ఆర్టీఐ చట్టం అమలుకు తీసుకున్న చర్యల వివరాలను దరఖాస్తుదారులకు వెంటనే అందజేయాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కమిషనర్ చావలి సునీల్ ఆ శాఖ అధికారులను హెచ్చరించారు. దేవదాయ శాఖ పరిధిలోని కమిషనర్, ఆర్‌జేసీ, డీసీ, ఏసీ, జిల్లా అధికారి, డివిజన్ ఇన్‌స్పెక్టర్, తదితర పరిపాలన కార్యాలయాల్లో ఆర్టీఐ చట్టం అమలు విషయమై రాష్ట్ర సమాచార కమిషన్‌లో దాఖలైన అప్పీలును వర్చువల్ విధానంలో శుక్రవారం విచారించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారు కోరిన సమాచారం ఇవ్వకుండా, హైకోర్టు తీర్పు ప్రకారం దేవదాయ శాఖకు ఆర్టీఐ చట్టం వర్తించదని అధికారులు దాటవేత ధోరణితో పొంతన లేని సమాధానాలివ్వడం పట్ల కమిషనర్ సునీల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ, ప్రజలపై ప్రభావం చూపించే సమాచారాన్ని ఎవరూ కోరకుండానే అధికార యంత్రాంగం ఆర్టీఐ చట్టం సెక్షన్ 4(1)(సి) ప్రకారం స్వచ్ఛందంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేవదాయ శాఖ పరిపాలనా విభాగాలు హైకోర్టు తీర్పును ఉటంకిస్తూ సమాచారం ఇవ్వకపోవడం తగదని అన్నారు.

సర్కేడియన్ వి యాప్ ద్వారా గుండె వ్యాధుల నిర్ధారణ

- పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర
- 250 మందిని పరీక్షించిన సిద్ధార్థ్
- 10 మందికి గుండె సంబంధిత వ్యాధులున్నట్టు గుర్తింపు


సర్కేడియన్ వీ యాప్ అభివృద్ధి చేసిన సిద్ధార్థ్‌తో సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర

పాడేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సర్కేడియన్ వి యాప్ ద్వారా గుండె సంబంధిత వ్యాధులు నిర్ధారించడం జరుగుతుందని జిల్లా కేంద్ర ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రిలో ఎన్ఆర్ఐ విద్యార్థి నంద్యాల సిద్ధార్థ్ అభివృద్ధి చేసిన సర్కేడియన్ వి యాప్ ద్వారా 250 మందికి పరీక్షలు నిర్వహించగా.. పది మందిలో గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు గుర్తించామన్నారు. పది మందికి జనరల్ మెడిసిన్ వైద్యనిపుణులు డాక్టర్ సురేశ్వర రెడ్డి టూడీ ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వారు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు నిర్ధారించి, కార్డియాలజీ సేవల కోసం తరలించామన్నారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలు శనివారం కూడా ఆస్పత్రిలో నిర్వహిస్తామని, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 14 ఏళ్ల ఎన్ఆర్ఐ విద్యార్థి కనిపెట్టిన ఈ సర్కేడియన్ వి యాప్ ఏఐ ఉపయోగించి కేవలం ఏడు సెకన్లలో గుండె జబ్బులను గుర్తిస్తుందన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సర్కేడియన్ వి యాప్‌ను అభివృద్ధి చేసిన విద్యార్థి సిద్ధార్థ్‌ను అభినందించారన్నారు. కలెక్టర్ అభ్యర్థన మేరకు సిద్ధార్థ్ పాడేరు వచ్చి పరీక్షలు నిర్వహించడం గొప్పతనమన్నారు. భవిష్యత్తులో సిద్ధార్థ్ మరిన్ని ఏఐ ఆవిష్కరణలు రూపొందించాలని సూపరింటెండెంట్ విశ్వమిత్ర ఆకాంక్షించారు.

గోవాడ షుగర్స్‌పై సర్కార్ నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

కన్నెత్తయినా చూడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. క్రషింగ్ జాప్యం కారణంగా పొలాల్లో, కాటాల వద్ద చెరకు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పొలాల్లో వున్న చెరకు మొత్తం క్రషింగ్ చేసే వరకు సీజన్‌ను ముగించవద్దని, పాత బకాయిలతోపాటు ప్రస్తుత సీజన్‌లో చెరకు సరఫరా చేస్తున్న రైతులకు వెంటనే చెల్లింపులు జరపాలని, కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటి తరువాత ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. నెలాఖరులోగా రైతులకు పాత బకాయిలు ఇవ్వడంతోపాటు, పొలాల్లో వున్న చెరకునంతటినీ క్రషింగ్ చేయాలని రైతు సంఘం నాయకుడు కోన మోహనరావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ బి.అప్పలరాజు, సిబ్బందితో ఫ్యాక్టరీ వద్దకు వచ్చారు. ఆందోళనకారులను అక్కడ నుంచి పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

24న చెరకు రైతులకు చెల్లింపులు: ఎండీ

ఆందోళన అనంతరం రైతు సంఘాల నేతలు గోవాడ షుగర్స్ ఎండీ సన్యాసినాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చారు. చెరకు బకాయిలు, ఫ్యాక్టరీ ఆధునికీకరణపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఎండీ స్పందిస్తూ.. చెరకు బకాయిలను వారంలోగా చెల్లించడానికి చర్యలు చేపట్టామన్నారు. పంచదార, మొలాసిస్‌ను విక్రయించి రైతులకు పాత బకాయిలు చెల్లిస్తామన్నారు. ప్రస్తుత సీజన్‌లో చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3151కాగా రూ.3 వేల చొప్పున సోమవారం రైతుల ఖాతాలకు జమచేస్తామన్నారు. ఫ్యాక్టరీకి రూ.28.5 కోట్లు విడుదల చేయాలని షుగర్ కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చెరకు రైతు సంఘం జిల్లా నాయకుడు కర్రి అప్పారావు, సీఐటీయూ నాయకులు గూనూరు వరలక్ష్మి, వి.వి.శ్రీనివాసరావు, గండి నాయనిబాబు, ఎస్.వీ.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీటి గండం

... 5వ పేజీ తరువాయి

పడిపోయాయి. పరిశ్రమలు ఏర్పాటు, అందుకు తగ్గట్టుగా జనాలు పెరగడంతో భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఆ తరువాత దేవరాపల్లిలో 9.77 మీటర్లు, బుచ్చెయ్యపేటలో 7.7, మునగపాకలో 6.53 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. నాతవరంలో కేవలం 0.46, కశింకోటలో 1.51, చీడికాడలో 1.57, మాకవరపాలెంలో 1.7 మీటర్ల లోతున నీరు ఉంది.

సముద్ర తీర ప్రాంతంలో ఉప్పు నీరు

అనకాపల్లి జిల్లాలో తీర ప్రాంతంలో ఉన్న రాంబిల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని గ్రామాల్లో భూగర్భ జలాల్లో ఉప్పునీటి శాతం పరిమితికి మించి నమోదవుతున్నది. ఒక లీటరు నీటిలో కరిగే లవణాలు 500 మిల్లీగ్రాముల వరకూ ఉండాలి. 2000 మిల్లీ గ్రాముల వరకూ ఉంటే నీటిని కాచి వడకాసి వినియోగించవచ్చు.

అయితే ఒక లీటరు నీటిలో కరిగే లవణాలు మూడు నుంచి నాలుగు వేల మిల్లీగ్రాముల వరకు ఉన్నట్టు భూగర్భ జల శాఖ ప్రాంతీయ ప్రయోగశాలలో గుర్తించారు. తీరప్రాంతాల్లో 40 మీటర్లకు మించి లోతులో నీటిని వినియోగించరాదు. కానీ పరిమితికి మించి నీటిని వాడుతున్నారు. అంతే స్థాయిలో వర్షం నీరు ఇంకే యంత్రాంగం లేదు.

ప్రతి ఇంట్లో వర్షపునీటి నిల్వ చేయాలి

శ్రీనివాసరావు, డీడీ, భూగర్భ జల శాఖ, అనకాపల్లి జిల్లా

నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వినియోగం పెరిగింది. భూమిలో నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నాం. కానీ వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా కాంక్రీట్ చేసేస్తున్నారు. 2030కల్లా నీటికి కటకట వచ్చే పరిస్థితి ఉందని ఇప్పటికే నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకు తగినంతగా ప్రజలు సన్నద్ధం కావడం లేదు. ఇంటి నిర్మాణ అనుమతుల్లో తప్పనిసరిగా నీటి నిల్వకు ఏర్పాట్లు చేయాలనే నిబంధన అమలుచేయాలి. నేల స్వభావం, నిర్మాణం విధానం మేరకు వర్షపు నీటి నిల్వ ట్యాంకులు నిర్మించాలి. గ్రామీణ ప్రాంతంలో సాధ్యమైనంతగా ఉపరితలంలో లభించే నీటిని వాడుకోవాలి. చెరువులు, వాగులు, పాడుపడిన బావులను నీటి నిల్వలకు అనుగుణంగా రూపొందించాలి. తీర ప్రాంతాల్లో ప్రజలు 40 మీటర్లకు మించి బోర్లు వేయకూడదు. నీటి ప్రాధాన్యంపై ప్రజలను చైతన్య పరచాలి.

ఆదివాసీలకు అన్యాయం!?

... 5వ పేజీ తరువాయి

తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. తమ సాగులో వున్న భూమిని సబ్‌డివిజన్ చేసి, ఎటువంటి రికార్డులు లేని ఎన్ఆర్ఐ పేరున ఆన్‌లైన్ ఎలా చేస్తారంటూ తహసీల్దార్‌ను నిలదీశారు. 50 ఏళ్ల నుంచి భూములను సాగు చేసుకుం టు న్నామని, ఇంతవరకు ఒక్కరు కూడా ఈ భూములు తమవి అంటూ రాలేదని, అటువం టప్పుడు ఎన్ఆర్ఐకి అనువంశికంగా ఈ భూ ములు ఎలా సంక్రమించాయని ప్రశ్నించారు.

నర్సీపట్నానికి చెందిన కాంట్రాక్టర్ కొనుగోలు?

కాగా ఎన్ఆర్ఐ దుగ్గిరా బాలకృష్ణకు రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేసిన 23.4 ఎకరాలను నర్సీపట్నానికి చెందిన ఒక కాంట్రాక్టర్ కొనుగోలు చేసి, వారం రోజుల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు మండలంలో ప్రచారం జరుగుతున్నది.

కాగా పాతమల్లంపేట రెవెన్యూ పరిధిలో వివాదాస్పద భూముల గురించి తహసీల్దార్ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా... ఎన్ఆర్ఐ దుగ్గిరాల బాలకృష్ణ పేరుపై రిజిస్ట్రేషన్ రికార్డులు ఉన్నాయన్నారు. వాటి ఆధారంగానే జిరాయితీ భూమిగా ఆన్‌లైన్ చేశామని తెలిపారు.

ఎండ తీవ్రతతో జనం విలవిల

5వ పేజీ తరువాయి

మండలంలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మాడుగుల మండలంలో 39 డిగ్రీలు, రావికమతంలో 39.2, నర్సీపట్నంలో 38.5, అనకాపల్లిలో 37.8, అచ్యుతాపురంలో 35.1, బుచ్చెయ్యపేటలో 37.8, చీడికాడలో 36.8, చోడవరం 35.8, దేవరాపల్లిలో 36.6, గొలుగొండలో 37.5, కె.కోటపాడులో 35.5, కశింకోటలో 37.1, కోటవురట్లలో 37.4, మాకవరపాలెంలో 38.1, మునగపాకలో 36.6, నక్కపల్లిలో 34.9, పరవాడలో 34.4, పాయకరావుపేటలో 34.6, రాంబిల్లిలో 31.9, రోలుగుంటలో 37.6, ఎస్.రాయవరంలో 35, సబ్బవరంలో 36.3, ఎలమంచిలిలో 34.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్రైం... crime news

రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

పాయకరావుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల క్రితం పాయకరావుపేటలో రైలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్టు తుని జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 17వ తేదీన స్థానిక రాజీవ్‌కాలనీ రైల్వే గేటు సమీపంలో ఒక వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. అక్కడ స్పృహలోకి వచ్చినప్పుడు తన పేరు పసగడుగుల సత్యనారాయణ(55) అని, కోటవురట్ల మండలం పి.కొత్తపల్లి గ్రామం అని చెప్పాడు. గ్రామంలో టైలరింగ్ షాపు నిర్వహిస్తుంటాడు. డి.పోలవరంలో బంధువుల ఇంటికి వెళుతుండగా పాయకరావుపేటలో ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెట్టుపై నుంచి జారిపడి గిరిజనుడి మృతి

డుంబ్రిగుడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతంగి పంచాయతీ పెదపాడులో గిరిజనుడు జీలుగు చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదపాడుకు చెందిన బడ్నాయిని బాలన్న (55) గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో జీలుగు చెట్టెక్కారు. పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

క్వారీలో ప్రమాదం.. డ్రిల్లింగ్ కార్మికుడి మృతి

కొత్తూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుంచంగి గ్రామంలో ఉన్న ఒక క్వారీలో డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికుడిపై రాళ్లు పడడంతో గాయపడి మృతిచెందాడు. అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి. ఒడిశాకు చెందిన కెసబ్ జాని (30) కుంచంగిలోని పలు క్వారీల్లో డ్రిల్లింగ్ పనులు చేస్తుంటాడు. శుక్రవారం బండి భవానీ క్వారీలో డ్రిల్లింగ్ చేస్తుండగా ప్రకంపనలు రావడంతో పై నుంచి రాళ్లు మీద పడడంతో జాని తలకు తీవ్ర గాయమైంది. సహచర కార్మికులు చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పరవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి- గాజువాక రహదారిలోని బొట్టవానిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన రాకేశ్‌కుమార్ (24) అగనంపూడిలో నివాసం ఉంటూ గ్యాస్ కట్టర్ పనులు చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం అగనంపూడి నుంచి ద్విచక్ర వాహనంపై అచ్యుతాపురం వెళుతుండగా బొట్టవానిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో రాకేశ్‌కుమార్‌కు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు.

బస్సును ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

మాకవరపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.గంగవరం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి గుడివాడ తాతీయలు మృతి చెందారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి గుడివాడ తాతీయలు(62) శుక్రవారం ఉదయం నర్సీపట్నం బైక్‌పై వెళ్లారు. అక్కడ పనులు చూసుకొని మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తిరిగి పెద్దిపాలెం వస్తుండగా జి.గంగవరం వద్ద అనకాపల్లి నుంచి నర్సీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో తాతీయలు అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ.దామోదరనాయుడు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై ఇరువర్గాలపై కేసులు


తొలగించిన రేకుల షెడ్డు


గాయపడిన సర్పంచ్ రాజబాబు

గొలుగొండ మార్చి, 21 (ఆంధ్రజ్యోతి): దాడి ఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్. రామారావు తెలిపారు. శుక్రవారం ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తమల్లంపేట గ్రామ శివారుల్లో పదేళ్లుగా రొంగలి సత్యవతి రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. తమ కుటుంబ ఆస్తి పంపకాల్లో భాగంగా మరొకరు ఆ రేకుల షెడ్డు తమదంటూ కోర్టును ఆశ్రయించారు. ఇదిలావుండగా గురువారం సాయంత్రం స్థానిక సర్పంచ్ పోలిరెడ్డి రాజబాబు షెడ్డును ఎక్స్‌కవేటర్‌తో దగ్గరుండి తొలగిస్తుండగా సమాచారం తెలుసుకున్న సత్యవతి కుటుంబ సభ్యులు కొంత మంది అక్కడకు చేరుకుని సర్పంచ్‌పై దాడికి దిగారు. సర్పంచ్ తలకు గాయం కాగా, రెండో వర్గానికి చెందిన రొంగలి సత్యవతికి కూడా గాయం కావడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

సామాజిక కార్యకర్తపై దాడి

నర్సీపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త శివ నారాయణరావుపై జరిగిన దాడిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారులో వచ్చిన ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం శివనారాయణరాజు ఇంటి వద్ద కాపుకాసి అతన్ని మేడ మెట్ల మీదకు తీసుకు వెళ్లి దాడి చేసి, అంతు చూస్తామని బెదిరించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీసీ ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు కారు అనకాపల్లికి చెందినదిగా గుర్తించారు. దాడి చేసిన వ్యక్తులు ఎవరు అనేది ఇంకా తేలలేదని, విచారణ చేస్తున్నామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

అనకాపల్లి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి అనకాపల్లి వచ్చినట్టు కుటుంబ సభ్యులు ఫొటో పంపి సమాచారం అందించాడు. దీంతో అక్కడి పోలీసుల నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఉడ్‌పేట ప్రాంతానికి వెళ్లి యువకుడి ఆత్మహత్య ప్రయత్నాన్ని అడుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్టు

నర్సీపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టపాలెం పంచాయతీ కసిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బర్ల సంతోషి తన ఇంట్లోని బంగారం గొలుసు పోయిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. రూరల్ సీఐ రేవతమ్మ అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం అయ్యన్న కాలనీకి చెందిన మాకిరెడ్డి నాగరాజు జనవరి 27న కసిరెడ్డిపాలెం వెళ్లి సంతోషి బంగారం గొలుసు దొంగతనం చేసి, అతని స్నేహితుడు అల్లంపల్లి ఈశ్వరరావుకి తాకట్టు పెట్టమని ఇచ్చాడు. అతను బ్యాంకులో రూ.1,02,426లకు తాకట్టు పెట్టాడు. మాకిరెడ్డి నాగరాజుకి రూ.80 వేలు ఇచ్చి, మిగిలిన డబ్బులుసొంతానికి వాడుకున్నాడు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించామని ఆమె తెలిపారు.